ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888


పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -60 పేజీలు - 8 వెల - 03/- శుక్రవారం 19 జూన్ 2026

## పెట్రో ధరల తగ్గింపుపై ఆశలు..

### ఇప్పుడే కుదరదంటున్న కేంద్రం!



- తగ్గిన పశ్చిమాసియా ఉద్రిక్తతలు
- దీంతో దిగొచ్చిన ముడి చమురు ధరలు
- రిటైల్ ధరలూ తగ్గుతాయని ప్రజల ఆశాభావం
- వెంటనే సాధ్యం కాదన్న సురేశ్ గోపీ
- ముడి చమురు సరఫరాలో ఇంకా ఇబ్బందులు
- అవి సద్దుమణిగాకే ధరల్లో సవరణకు అవకాశం

**ఢిల్లీ జూన్ 18 (రిపబ్లిక్ న్యూస్):** అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గినంత మాత్రాన దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గవని కేంద్ర పెట్రోలియం, సహజవాయు శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ స్పష్టం చేశారు. మిగతా 2లో...

## టెలిగ్రామ్ ఒక కొత్త డార్క్ వెబ్.. సైబర్ క్రైమ్స్‌కు అడ్డా




- : హైకోర్టుకు తెలిపిన కేంద్రం
- నీట్ రీ-టెస్ట్ నేపథ్యంలో టెలిగ్రామ్‌పై తాత్కాలిక నిషేధం
- నిషేధాన్ని సవాల్ చేస్తూ టెలిగ్రామ్ హైకోర్టులో పిటిషన్

**ఢిల్లీ జూన్ 18 (రిపబ్లిక్ న్యూస్):** మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ టెలిగ్రామ్ ఒక 'కొత్త డార్క్ వెబ్'గా రూపాంతరం చెందిందని, సైబర్ నేరగాళ్లు, ఉగ్రవాదులు, పరీక్షల అక్రమాలకు పాల్పడే ముఠాలకు ఇది అడ్డాగా మారిందని కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ హైకోర్టుకు విన్నవించింది. నీట్-యూజీ 2026 రీ-టెస్ట్ మిగతా 2లో...

## శాంతి ఒప్పందంపై సంతకాలు



### ఫ్రాన్స్‌లో ట్రంప్-టెహ్రాన్‌లో పెజెష్కియాన్
### నేడు అధికారికంగా సంతకాల కార్యక్రమం

**జూన్ 18 (రిపబ్లిక్ న్యూస్):** మధ్యప్రాచ్యంలో యుద్ధాన్ని ముగించేందుకు ఉద్దేశించిన శాంతి ఒప్పందంపై అమెరికా, ఇరాన్ అధ్యక్షులు సంతకాలు చేశారు. దీంతో ఒప్పందం తక్షణమే అమలులోకి వచ్చింది. ఈ ఒప్పందం ప్రకారం హోర్ముజ్ జలసంధిని ఇరాన్ తెరుస్తుంది. అదే విధంగా ఇరాన్ ఓడరేవులపై విధించిన దిగ్బంధాన్ని అమెరికా ఎత్తివేస్తుంది. ఇరాన్ పునర్నిర్మాణానికి 300 బిలియన్ డాలర్ల ఆర్థిక సాయం అందుతుంది. ఇరాన్‌పై విధించిన అన్ని రకాల ఆంక్షలను మిగతా 2లో...

# పారిశ్రామిక ఫలాలు పేదలకు చేర్చాలి

### 'నాన్-సీరియస్ ప్లేయర్స్'కు ఏపీలో చోటులేదు: సీఎం చంద్రబాబు

- రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో రూ. 30,515 కోట్ల పెట్టుబడులకు ఆమోదం
- ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో సుమారు 30 వేల ఉద్యోగాలు రానున్నాయని అంచనా
- ఇథనాల్, సెమీ కండక్టర్ల పరిశ్రమలను ప్రోత్సహించాలని అధికారులకు దిశానిర్దేశం
- ప్రాజెక్టులు ప్రారంభించాకే ప్రోత్సాహకాలు ఇవ్వాలని మంత్రి లోకేశ్ స్పష్టీకరణ

**అమరావతి జూన్ 18 (రిపబ్లిక్ న్యూస్):** పారిశ్రామిక అభివృద్ధి ఫలాలు రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి ప్రజలకు చేరేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన 18వ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశంలో మిగతా 2లో...





## తిరుపతికి మరో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ..



- మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఎంవోయూ
- తిరుపతిలో జేఎస్ఎస్ మహావిద్యాపీఠం ఆఫ్-క్యాంపస్ ఏర్పాటు
- మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం
- 74 కోర్సులతో 10 వేల మందికి పైగా విద్యార్థులకు ఉన్నత విద్య
- ప్రాజెక్టు ద్వారా 20 వేలకు పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన
- ప్రతిష్ఠాత్మక నాక్ ఏ++ గుర్తింపు పొందిన జేఎస్ఎస్ విద్యాసంస్థ

**అమరావతి జూన్ 18 (రిపబ్లిక్ న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌లో నూతనంగా కొలువుదీరిన ప్రజాప్రభుత్వంలో విద్యా రంగం అభివృద్ధికి కీలక అడుగు పడింది. ఆధ్యాత్మిక నగరమైన తిరుపతికి మరో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ రానుంది. మైసూరు కేంద్రంగా పనిచేస్తున్న జగద్గురు శ్రీ శివరాత్రీశ్వర (జేఎస్ఎస్) మహావిద్యాపీఠం, తమ ఆఫ్-క్యాంపస్‌ను తిరుపతిలో ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో అమరావతిలో ఏపీ ఉన్నత విద్యామండలి, జేఎస్ఎస్ మధ్య అవగాహన ఒప్పందం (ఎంవోయూ) జరిగింది. ఈ ఒప్పంద పత్రాలపై ఏపీ ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, జేఎస్ఎస్ మహావిద్యాపీఠం టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, జేఎస్ఎస్ ఏహెచ్ఈఆర్ ప్రో ఛాన్సలర్ డా.బి.సురేష్ సంతకాలు చేసి మార్చుకున్నారు. మిగతా 2లో...

## అనాథ పిల్లలకూ తల్లికి వందనం



- మంత్రి నారా లోకేశ్ కీలక ఆదేశాలు
- చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచన

**అమరావతి జూన్ 18 (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్ర విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుడుతూ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ కోసం కేంద్రమిగతా 2లో...

## విజయవాడ కస్టడీ డెత్ కేసుపై సీబీఐ విచారణకు జగన్ డిమాండ్

- మే 9 నుంచి అదృశ్యమైన యువకుడు సాయికృష్ణ
- బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వ తీరుపై విమర్శలు



**విజయవాడ జూన్ 18 (రిపబ్లిక్ న్యూస్):** కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో 25 ఏళ్ల గాదె సాయికృష్ణ అనుమానాస్పద మృతిపై సీబీఐ విచారణ జరిపించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సాయికృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఘటనను కప్పిపుచ్చేందుకు విజయవాడ పోలీస్ కమిషనర్, డీజీపీ స్థాయి అధికారులు ప్రయత్నిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు.మిగతా 2లో...



## జూన్ 30న రైతు భరోసా

- కేబినెట్ నిర్ణయాలను వెల్లడించిన ఉత్తమ్
- 7 రకాల సన్న వడ్లకు బోనస్ ఇవ్వనున్నట్టు వెల్లడి
- నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామన్న మంత్రి

**హైదరాబాద్ జూన్ 18 (రిపబ్లిక్ న్యూస్):** తెలంగాణ సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈరోజు జరిగిన కీలక కేబినెట్ సమావేశంలో ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ భేటీ వివరాలను భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. "వానాకాలం రైతు భరోసా నిధులను విడుదల చేయాలని కేబినెట్ నిర్ణయించింది. మిగతా 2లో...

## లిక్కర్ స్కామ్ కేసులో కారుమూరి సునీల్ అరెస్ట్

- మాజీ మంత్రి కారుమూరి కుమారుడికి 14 రోజుల రిమాండ్
- సునీల్‌ను అరెస్ట్ చేసి చంచల్‌గూడ జైలుకు తరలించిన ఈడీ
- రూ.28 కోట్ల కిక్‌బ్యాకులు పొందినట్లు ఈడీ ఆరోపణ
- ఈ స్కామ్ వల్ల ప్రభుత్వానికి రూ.195 కోట్ల నష్టం వాటిల్లినట్టు అంచనా



**హైదరాబాద్ జూన్ 18 (రిపబ్లిక్ న్యూస్):** గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం రవాణా కుంభకోణం కేసులో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు కారుమూరి సునీల్ కుమార్‌కు హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. కోర్టు ఆదేశాల అనంతరం అధికారులు ఆయన్ను చంచల్‌గూడ కేంద్ర కారాగారానికి తరలించారు. జూన్ 18న సునీల్ నివాసం, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించిన అనంతరం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ఆయన్ను అరెస్ట్ చేశారు. మిగతా 2లో...

## గ్రీనింగ్ సొసైటీ ఏర్పాటు చేయండి

- జులై 3నాటికి ప్రక్రియ పూర్తి కావాలి
- ప్రతి గ్రామ పంచాయతీలో నర్సరీ ఉండాల్సిందే
- సీడ్ బాల్స్ కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంలా మార్చండి
- అటవీ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష
- ఉప ముఖ్యమంత్రి, పవన్ కళ్యాణ్



**అమరావతి జూన్ 18 (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్రంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా ప్రతిపాదించిన 'గ్రీనింగ్ సొసైటీ' ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఆదేశించారు. జులై 3వ తేదీ నాటికి ఈ సొసైటీ ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియ పూర్తి కావాలని స్పష్టం చేశారు. మిగతా 2లో...

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888



# జూన్ 30న రైతు భరోసా

**మొదటిపేజీ తరువాయి**

జూన్ 30వ తేదీన మధిరలో నిర్వహించబోయే 'రైతు సమ్మేళనం' బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి ఈ నిధులను నేరుగా విడుదల చేస్తారు. మార్కెట్ డిమాండ్ మేరకు 7 రకాల సన్న వడ్లకు బోనస్ ఇవ్వాలని కూడా కేబినెట్ నిర్ణయించింది" అని తెలిపారు.తెలంగాణ నుండి కేంద్రం తక్కువ ధాన్యం సేకరించడం సరికాదని అన్నారు.. ఎరువుల కోటా, రామగుండం యూరియాలో రాష్ట్రానికి సింహభాగం కేటాయింపు, హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 అనుమతులు, ఐఆర్ఎఫ్ సీ రుణాల విడుదలపై త్వరలోనే మంత్రుల బృందం ఢిల్లీ వెళ్లనుందని చెప్పారు. రాష్ట్రాభివృద్ధి కోసం బీజేపీ ఎంపీలు కూడా కలిసి రావాలని పిలుపునిచ్చారు. జూన్ 21న జరిగే నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కేబినెట్ నిర్ణయించిందని చెప్పారు. ఇకపై అంతా డిజిటల్ కేబినెట్ నిర్వహిస్తామన్నారు.

# పెట్రో ధరల తగ్గింపుపై ఆశలు..

**మొదటిపేజీ తరువాయి**

ఇంధన ధరల నిర్ణయంలో ముడిచమురు ధరలతో పాటు రవాణా, సరఫరా, మార్కెట్ పరిస్థితుల వంటి అంశాలు ప్రభావం చూపుతాయని తెలిపారు.తక్కువ ధరకు కొనుగోలు చేసిన ముడిచమురు భారత్‌కు చేరేందుకు సమయం పడుతుందని సురేశ్ గోపీ చెప్పారు. ముఖ్యంగా హర్మూజ్ జలసంధి మార్గంలో నౌకల రద్దీ ఎక్కువగా ఉండటంతో సరఫరా ప్రక్రియ సాధారణ స్థితికి రావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అందువల్ల అంతర్జాతీయ ధరలు తగ్గిన వెంటనే దేశీయ ఇంధన ధరలను తగ్గించడం సాధ్యం కాదన్నారు.పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా ఇటీవల గ్లోబల్ ఇంధన మార్కెట్లలో తీవ్ర ఒడుదొడుకులు చోటుచేసుకున్నాయని మంత్రి తెలిపారు. ముడిచమురు ధరల పెరుగుదల ప్రభావం పూర్తిగా వినియోగదారులపై పడకుండా కేంద్ర ప్రభుత్వం గణనీయమైన భారం భరించిందన్నారు. ఈ ప్రక్రియలో ప్రభుత్వానికి రూ.12 వేల కోట్ల మేర నష్టం వాటిల్లిందని చెప్పారు.

ఇంధన ధరలు పెరిగిన సమయంలో రాష్ట్ర ప్రభుత్వాలు తమ పన్నులను తగ్గించి ఆదాయాన్ని వదులుకోలేదని మంత్రి వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం, చమురు మార్కెటింగ్ సంస్థలు కూడా ఆర్థికంగా నిలదొక్కుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గే దిశగా దౌత్యపరమైన ప్రయత్నాలు ముందుకు సాగడంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గుముఖం పట్టాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 78 డాలర్లకు చేరగా డబ్ల్యూటీఐ క్రూడ్ ధర 75 డాలర్ల స్థాయికి దిగివచ్చింది. అయితే ఈ తగ్గుదల ప్రభావం దేశీయ ఇంధన ధరలపై కనిపించాలంటే మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

# విజయవాడ కస్టడీ డెత్ కేసుపై సీబీఐ విచారణకు జగన్ డిమాండ్

**మొదటిపేజీ తరువాయి**

గతంలో నేరచరిత్ర ఉన్న సాయికృష్ణను మే 9వ తేదీన మార్కాపురంలో కృష్ణలంక పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, అప్పటి నుంచి అతని ఆచూకీ తెలియలేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. తన కుమారుడిని పోలీసులు అక్రమంగా నిర్బంధించి చిత్రహింసలకు గురిచేశారని అతని తల్లి విజయలక్ష్మి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే, తాము సాయికృష్ణను అదుపులోకి తీసుకోలేదని, అతని కోసం గాలిస్తున్నామని పోలీసులు కోర్టుకు విన్నవించారు.

ఈ కేసుపై విచారణ చేపట్టిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, పోలీసుల వాదనలపై సందేహాలు వ్యక్తం చేసింది. జూన్ 29లోగా సాయికృష్ణను కోర్టు ముందు హాజరుపరచాలని, లేనిపక్షంలో సంబంధిత అధికారులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించింది. ఈ పరిణామాల నేపథ్యంలో, ప్రభుత్వం కృష్ణలంక సీఐ నాగరాజును సస్పెండ్ చేసి, ఒక సీనియర్ ఐపీఎస్ అధికారితో ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది.

ఈ ఘటనకు బాధ్యులైన వారిపై తక్షణమే హత్య కేసు నమోదు చేయాలని జగన్ డిమాండ్ చేశారు. టీడీపీ ప్రభుత్వం ఈ విషయాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తోందని ఆయన విమర్శించారు.

## టెలిగ్రామ్ ఒక కొత్త డార్క్ వెబ్.. సైబర్ క్రైమ్స్‌కు అడ్డా

**మొదటిపేజీ తరువాయి**

నేపథ్యంలో టెలిగ్రామ్‌పై విధించిన తాత్కాలిక నిషేధాన్ని సమర్థిస్తూ ప్రభుత్వం ఈ మేరకు అఫిడవిట్ దాఖలు చేసింది.జూన్ 21న జరగనున్న నీట్ రీ-టెస్ట్‌ను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. గత మే 3న జరిగిన నీట్ పరీక్ష పేపర్ లీక్ కావడం దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. ఈ ఘటనపై సీబీఐ విచారణకు ఆదేశించడంతో పాటు, పరీక్షను రద్దు చేసి పునర్నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో, 'నీట్ మాఫియా' వంటి టెలిగ్రామ్ ఛానెళ్ల ద్వారా మళ్లీ అక్రమాలు జరగకుండా నిరోధించేందుకే జూన్ 22 వరకు ఈ తాత్కాలిక నిషేధం విధించినట్లు కేంద్రం స్పష్టం చేసింది.టెలిగ్రామ్‌లోని ప్రైవసీ ఫీచర్లను ఆసరాగా చేసుకుని నేరగాళ్లు తమ ఫోన్ నంబర్లు, ఐడీలను గోప్యంగా ఉంచుతూ సులభంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ప్రభుత్వం తన అఫిడవిట్‌లో ఆరోపించింది. చైల్డ్ పోర్నోగ్రఫీ, మాదకద్రవ్యాల సరఫరా, ఉగ్రవాద ప్రచారం, సైబర్ దాడులు, ఆర్థిక మోసాలు వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు టెలిగ్రామ్ వేదికగా మారిందని పేర్కొంది. మరోవైపు, ప్రభుత్వ నిర్ణయం భారతదేశంలోని సుమారు 150 మిలియన్ల వినియోగదారుల భావప్రకటనా స్వేచ్ఛను హరిస్తోందని ఆరోపిస్తూ టెలిగ్రామ్ సంస్థ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. కొందరు నేరగాళ్ల చర్యల వల్ల వినియోగదారులందరినీ శిక్షించడం సరికాదని వాదించింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం, టెలిగ్రామ్‌కు ఎటువంటి తక్షణ ఊరట కల్పించలేదు. నీట్ పరీక్ష పవిత్రతను కాపాడేందుకే ఈ తాత్కాలిక చర్యలు తీసుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం పునరుద్ఘాటించింది.

# అనాథ పిల్లలకూ తల్లికి వందనం

**మొదటిపేజీ తరువాయి**

ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎంశ్రీ పథకం నిధుల వినియోగంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో విద్యాశాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సుదీర్ఘ సమీక్షలో ఈ ఘనత సాధించిన అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంక్షేమం, అభ్యసన సామర్థ్యాల పెంపు, మౌలిక వసతుల కల్పనపై పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు.రాష్ట్రవ్యాప్తంగా కడప మోడల్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఈ ఏడాది 844 స్మార్ట్ కిచెన్ల నిర్మాణానికి తక్షణమే చర్యలు చేపట్టాలని మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ప్రారంభమైన 'సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర' కిట్ల పంపిణీని మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ (పీటీఎం) నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అదేవిధంగా, రాష్ట్రంలోని 430 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) చదువుకుంటున్న 1,06,360 మంది విద్యార్థినులకు సౌకర్యవంతమైన వసతి కల్పించేందుకు 53,180 బంక్ బెడ్లను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ఈ సదుపాయాన్ని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీలకు కూడా విస్తరించాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని 2,03,430 మంది విద్యార్థులకు కూడా కిట్లు పంపిణీ చేస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు.తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలకు సైతం ప్రభుత్వ పథకాల ఫలాలు అందాలన్న లక్ష్యంతో మంత్రి లోకేశ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. 'తల్లికి వందనం' పథకాన్ని అనాథ పిల్లలకు కూడా వర్తింపజేయాలని, ఇందుకోసం వారి గార్డియన్ల వివరాలను కచ్చితత్వంతో సేకరించాలని ఆదేశించారు. ఒకవేళ ఎవరూ లేని పక్షంలో, ఆ నిధులను నేరుగా జిల్లా కలెక్టర్‌కు పంపి, వారి ద్వారా పిల్లలకు చేరేలా చూడాలన్నారు. అంతేకాకుండా, అనాథ పిల్లల పేరుపై బ్యాంకు ఖాతాలు తెరిచి, పథకం నిధులను నేరుగా జమ చేయాలని సూచించారు. వారి చదువు పూర్తయ్యాక ఆ మొత్తాన్ని వారు స్వేచ్ఛగా వినియోగించుకునేలా ఒక శాశ్వత విధానాన్ని రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. ఇది వారి భవిష్యత్తుకు బలమైన ఆర్థిక భరోసా ఇస్తుందని మంత్రి అభిప్రాయపడ్డారు.

## లిక్కర్ స్కామ్ కేసులో కారుమూరి సునీల్ అరెస్ట్

**మొదటిపేజీ తరువాయి**

తన తండ్రి పౌరసరఫరాల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఆ పలుకుబడిని ఉపయోగించి మద్యం రవాణా కాంట్రాక్టుల ద్వారా సునీల్ భారీగా లబ్ధి పొందారని, తద్వారా మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారని ఈడీ ఆరోపిస్తోంది.విచారణ సందర్భంగా, సుదర్శన్ కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన సందీప్, ప్రతాప్ రెడ్డిలతో సంబంధం ఉన్న సంస్థలకు కాంట్రాక్టులు అప్పగించడంలో భారీ అవకతవకలు జరిగాయని ఈడీ తరపు న్యాయవాది కోర్టుకు వివరించారు. ఈ వ్యవహారంలో సునీల్ సుమారు రూ.28 కోట్ల మేర కిక్‌బ్యాకులు అందుకున్నారని, మరో రూ.7 కోట్ల విలువైన కుటుంబ లావాదేవీలను గుర్తించామని తెలిపారు. ఈ కుంభకోణం కారణంగా ప్రభుత్వ ఖజానాకు దాదాపు రూ.195 కోట్ల నష్టం వాటిల్లిందని ఈడీ అభియోగాలు మోపింది.వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం రవాణా, పంపిణీ కాంట్రాక్టులలో చోటుచేసుకున్న అక్రమాలకు సంబంధించి ఈడీ గత కొంతకాలంగా దర్యాప్తు చేస్తోంది. ఈ కేసులో సునీల్ కుమార్ అరెస్ట్ ఒక కీలక పరిణామంగా మారింది. ప్రస్తుతం ఈ వ్యవహారానికి సంబంధించి తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

# తిరుపతికి మరో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ..

**మొదటిపేజీ తరువాయి**

70 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన జేఎస్ఎస్ విద్యాసంస్థకు భారత్‌తో పాటు విదేశాల్లో 300కు పైగా విద్యాసంస్థలు ఉన్నాయి. మైసూరు కేంద్రంగా ఉన్న జేఎస్ఎస్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (జీూ ూ౧జు=), నాక్ నుంచి ూ++ గుర్తింపు పొందిన డీమ్డ్ విశ్వవిద్యాలయం. ప్రతిష్ఠాత్మక ఎన్ఐఆర్ఎఫ్ 2025 ర్యాంకింగ్స్‌లో విశ్వవిద్యాలయాల విభాగంలో 21వ స్థానంలో, ఓవరాల్‌గా 38వ స్థానంలో నిలిచి తన నాణ్యతను చాటుకుంది.

**10 వేల మంది విద్యార్థులకు అవకాశం**

ప్రతిపాదిత తిరుపతి క్యాంపస్‌ను అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దనున్నారు. ఇందులో ఐదు సమగ్ర విద్యా పాఠశాలలను ఏర్పాటు చేస్తారు. అడ్వాన్స్‌డ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీస్, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ అండ్ బిహేవియరల్ సైన్సెస్, హెల్త్‌కేర్ అండ్ అలైడ్ సైన్సెస్, మేనేజ్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ టూరిజం, లా, హ్యూమానిటీస్, పాలసీ అండ్ గవర్నెన్స్ విభాగాల్లో మొత్తం 74 కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. క్యాంపస్ పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించాక, 10 వేల మందికి పైగా విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసించనున్నారు. వీటికి అదనంగా హెల్త్‌కేర్‌లో ఏఐ, సెమీకండక్టర్ అప్లికేషన్స్, హెల్త్ పాలసీ అండ్ గవర్నెన్స్, ఏరోస్పేస్ మెడిసిన్ వంటి ఆరు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ కూడా నెలకొల్పనున్నారు.

**20 వేల ఉద్యోగాలు.. స్వర్ణాంధ్ర విజన్‌కు అనుగుణంగా..**

ఈ ఒప్పందం ప్రకారం, తిరుపతిలో క్యాంపస్ ఏర్పాటుకు అవసరమైన భూమి కేటాయింపు, చట్టబద్ధమైన అనుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం సింగిల్-విండో విధానాన్ని కల్పిస్తుంది. క్యాంపస్ నిర్మాణానికి అయ్యే మొత్తం వ్యయాన్ని జేఎస్ఎస్ మహావిద్యాపీఠమే భరిస్తుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 20 వేలకు పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా. ఇది స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా రాష్ట్ర యువతకు గొప్ప అవకాశాలను అందిస్తుంది.

ఈ కార్యక్రమంలో జేఎస్ఎస్ ఏహెచ్ఈఆర్ రిజిస్ట్రార్ డా.బి.మంజునాథ, డీన్(రీసెర్చ్) డా. ప్రశాంత్ ఎమ్ విశ్వనాథ్, కేపీఎంపీ అడ్వైజరీ సర్వీసెస్ అసోసియేట్ డైరెక్టర్ ఎస్.రాఘవన్ తదితరులు పాల్గొన్నారు

# పారిశ్రామిక ఫలాలు పేదలకు చేర్చాలి

**మొదటిపేజీ తరువాయి**

రూ. 30,515 కోట్ల విలువైన 50 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. ఈ కంపెనీల ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో 29,677 ఉద్యోగాలు రానున్నాయని అంచనా వేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, పరిశ్రమల స్థాపన కేవలం ధనికులకే సాధ్యమనే భావనను తొలగించి, సామాన్యులు కూడా పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అనువైన వాతావరణం సృష్టించాలని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ, "రాష్ట్రంలో పెద్ద ఎత్తున పారిశ్రామికాభివృద్ధి జరుగుతోంది. ఈ ఫలాలు పేద, మధ్య తరగతికి ఉద్యోగాల రూపంలోనే కాకుండా, వారు కూడా కంపెనీలు స్థాపించేలా ప్రోత్సహించాలి. స్టార్టప్‌లకు పెద్దపీట వేయాలి. దీనికోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్టీఐహెచ్ (ఆర్టీఐహెచ్) సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని, వెంచర్ క్యాపిటలిస్టుల నుంచి పెట్టుబడులు ఆకర్షించాలి" అని దిశానిర్దేశం చేశారు.

ప్రాజెక్టులకు అనుమతులు పొందాక వెంటనే పనులు ప్రారంభించని సంస్థల విషయంలో కఠినంగా వ్యవహరించాలని, 'నాన్-సీరియస్ ప్లేయర్స్'కు ఏపీలో చోటులేదని హెచ్చరించారు.

**ఇథనాల్, సెమీ కండక్టర్లకు పెద్దపీట**

ఇథనాల్ ఆధారిత ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించాలని, దీనివల్ల రైతులకు ప్రయోజనం చేకూరడంతో పాటు ఇంధన దిగుమతుల భారం తగ్గుతుందని సీఎం అన్నారు. 40 శాతం ఇథనాల్ బ్లెండింగ్‌కు కేంద్రం అంగీకరించిన నేపథ్యంలో ఇథనాల్ తయారీ పరిశ్రమలను ప్రోత్సహించాలని సూచించారు.

అదేవిధంగా, సెమీ కండక్టర్ల తయారీకి అవసరమైన ఎకోసిస్టమ్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, లిథియం అయాన్, ఫాస్ట్ ఛార్జింగ్ బ్యాటరీల ఉత్పత్తిని ప్రోత్సహించాలని ఆదేశించారు. రైతుల కోసం ప్రత్యేకంగా మైక్రో ఇరిగేషన్ ఎక్విప్‌మెంట్ పార్క్ ఏర్పాటు చేయాలని, దీనివల్ల రైతులకు తక్కువ ధరకే పరికరాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

**పర్యాటకం, మౌలిక వసతులపై దృష్టి**

రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని బలోపేతం చేసేందుకు టెంపుల్ టూరిజం, బీచ్ టూరిజం అభివృద్ధి చేయాలన్నారు. సూర్యలంక బీచ్‌కు మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని, హార్సిలీ హిల్స్‌లో మంచి రిసార్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. పురాతన స్వర్ణగిరిగా పేరున్న జొన్నగిరి గోల్డ్ మైన్ ఉత్పత్తిని వేగవంతం చేయాలన్నారు. పారిశ్రామిక ప్రాంతాల వద్ద కార్మికులకు అందుబాటు ధరల్లో గృహ నిర్మాణాలు చేపట్టాలని, ప్రాజెక్టుల అనుమతుల ప్రక్రియను ఆటోమేషన్ చేసి రాజకీయ జోక్యాన్ని తగ్గించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పుట్టపర్తిలో 5వ తరం ఫైటర్ జెట్ తయారీ కేంద్రాన్ని వేగంగా పూర్తి చేయాలని, బెంగళూరు-పుట్టపర్తిని ఏరోస్పేస్, డిఫెన్స్ కారిడార్‌గా మార్చాలని ఆదేశించారు.

**ప్రాజెక్టులు ప్రారంభించాకే ప్రోత్సాహకాలు: మంత్రి లోకేశ్**

ఈ సమావేశంలో పాల్గొన్న ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేశ్ కీలక సూచనలు చేశారు. భూ కేటాయింపులు పొందిన కంపెనీలు ప్రాజెక్టులను ప్రారంభించిన తర్వాతే ప్రోత్సాహకాలు, రాయితీలు అమలు చేయాలని స్పష్టం చేశారు. "ప్రాజెక్టులు వేగంగా ప్రారంభమైతేనే జీఎస్టీ రూపంలో రాష్ట్రానికి ఆదాయం వస్తుంది. అప్పుడు ప్రోత్సాహకాలు ఇవ్వడం సమంజసంగా ఉంటుంది" అని అభిప్రాయపడ్డారు.

స్థానిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని, ఆంధ్రా యూనివర్సిటీలో రేర్ ఎర్త్ మినరల్స్‌పై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేష్, అనగాని సత్యప్రసాద్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# శాంతి ఒప్పందంపై సంతకాలు

**మొదటిపేజీ తరువాయి**

అమెరికా తొలగిస్తుంది. అయితే శాంతి ఒప్పందంలో ఇరాన్ అణు కార్యక్రమం ప్రస్తావన లేదు. దీనిపై కాల్పుల విరమణ అమలులో ఉండే 60 రోజుల కాలంలో చర్చించి నిర్ణయం తీసుకుంటారు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ-7 సదస్సుకు హాజరైన సందర్భంగా ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. ఈ ఒప్పందం 'ఆర్థిక విపత్తు'ను తప్పిస్తుందని ఆయన చెప్పారు. అయితే ఇరాన్‌తో తుది ఒప్పందం కుదరని పక్షంలో ఆ దేశంపై బాంబు దాడులు తప్పవని హెచ్చరించారు. శాంతి ఒప్పందంపై ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ బుధవారమే సంతకం చేశారని టెహ్రాన్ ధృవీకరించింది. అయితే అమెరికాపై తన అపనమ్మకం అలాగే ఉండిపోయిందని, టెహ్రాన్ వేలు ట్రిగ్గర్ పైనే ఉన్నదని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్, చర్చల ప్రతినిధి మహమ్మద్ బాఘర్ ఘలీబఫ్ చెప్పారు. అమెరికా కనుక తన హామీలను నెరవేర్చని పక్షంలో తామూ వాటికి కట్టుబడి ఉండబోమని స్పష్టం చేశారు.

వర్సైల్లెస్ ప్యాలెస్‌లో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్ ఇచ్చిన విందు సందర్భంగా ఎంఓయూ హార్డ్ కాపీపై ట్రంప్ సంతకం చేశారు. ఆ సమయంలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో ఆయన వెనకే నిలుచుని ఉన్నారు. ట్రంప్ సంతకం చేసిన ఒప్పంద పత్రాన్ని అధికారులు ఇరాన్‌కు పంపారు. దానిపై టెహ్రాన్‌లో పెజెష్కియాన్ సంతకం చేస్తుండగా తీసిన చిత్రాలను ఇరాన్ ప్రభుత్వ మీడియా ఐఆర్ఎన్ఏ ప్రచురించింది. ఇరాన్ కోరిక మేరకు ఎంఓయూను ఆంగ్లంలోనూ, ఫార్సీ భాషలోనూ ముద్రించారు. 'సంతకం చేశాను' అని ట్రంప్ విలేకరులకు చెప్పారు. శాంతి ప్రణాళిక ప్రపంచవ్యాప్త మాంద్యాన్ని నివారిస్తుందని ఆయన తెలిపారు. జీ-7 సదస్సు జరిగిన ఎవియన్-లెస్-బెయిన్స్‌లోని రిసార్టులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్థిక విపత్తును చూడాలని తాను అనుకోవడం లేదని చెప్పారు. యుద్ధం కొనసాగితే అదే సంభవించి ఉండేదని అన్నారు. 'నాకు తెలిసింది ఒక్కటే. మనం శాంతికి అవకాశాల గురించి మాట్లాడిన ప్రతిసారీ స్టాక్ మార్కెట్ రాకెట్ మాదిరిగా దూసుకుపోయింది. రాజీకి రాలేము వంటి ప్రతికూల విషయాలు చెప్పినప్పుడు మాత్రం అది భారీగా పతనమైంది' అని తెలిపారు. మాక్రాన్ ఇచ్చిన విందుకు హాజరైన అనంతరం ట్రంప్ వాషింగ్టన్ బయలుదేరారు.

**ఒప్పందంలోని అంశాలు ఇవే**

14 పాయింట్లతో కూడిన శాంతి ఒప్పంద పత్రాన్ని అమెరికా ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు విడుదల చేశారు. 'అమెరికా-ఇరాన్ మధ్య ఇస్లామాబాద్ అవగాహనా ఒప్పందం' పేరిట విడుదల చేసిన ఈ పత్రంలో హార్మూజ్ జలసంధిని తెరవడం, ఇరాన్‌పై విధించిన ఆర్థిక ఆంక్షలను తొలగించడం, తదుపరి సాంకేతిక చర్చలలో ఇరాన్ అణు కార్యక్రమం ప్రస్తావన వంటి కీలక అంశాలు ఉన్నాయి. 'హార్మూజ్‌ను వెంటనే తెరవడానికి ఈ ఒప్పందం వీలు కల్పిస్తుంది. అణు ధూళిని నాశనం చేయడానికి ఇరాన్ కట్టుబడి ఉండేలా చేస్తుంది. ఇరాన్ తన సత్ప్రవర్తనను మెరుగుపరచుకుంటే దానిని మరింత సంపన్న దేశంగా మార్చగలిగిన ఆర్థిక, ఆంక్షల ఉపశమనాన్ని అందించడానికి మాకు అవకాశం ఇస్తుంది' అని అమెరికా అధికారి తెలిపారు. ఒప్పంద పత్రంపై నేడు అధికారికంగా సంతకాలు జరుగుతాయి. ఒప్పందం యొక్క తుది నిబంధనలపై చర్చలు జరపడానికి నిర్దేశించుకున్న 60 రోజుల గడువు కూడా నేడే ప్రారంభం అవుతుంది. ఈ ఒప్పందం రెండు దేశాల మధ్య కాల్పుల విరమణను పొడిగిస్తుందని అమెరికా అధ్యక్షభవనం అధికారి ఒకరు చెప్పారు. ఇది 'పనితీరు ఆధారిత' ఒప్పందమని ట్రంప్ ప్రభుత్వం వ్యాఖ్యానించింది. కాగా ఒప్పందంలోని అంశాలు ఇలా ఉన్నాయిడ.

# గ్రీనింగ్ సొసైటీ ఏర్పాటు చేయండి

**మొదటిపేజీ తరువాయి**



గ్రీనింగ్ సొసైటీకి సంబంధించిన నిబంధనలు, నియామకాలు, విధివిధానాల ప్రతిపాదనలన్నీ కచ్చితంగా ప్రెసిడెన్షియల్ ఆర్డర్ 2025కి అనుగుణంగానే ఉండేలా చూసుకోవాలని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు అత్యంత ప్రాధాన్యత కలిగినది కావడంతో, ఎలాంటి కాలయాపన చేయకుండా సొసైటీ త్వరగా కార్యరూపం దాల్చేలా తక్షణ చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. గురువారం వెలగపూడి సచివాలయంలో అటవీశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ "రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయతీలోనూ ఒక నర్సరీ ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలి. ఎక్కడైనా పంచాయతీలో ఏర్పాటు సాధ్యం కాకపోతే, కనీసం మూడు, నాలుగు పంచాయతీలను ఒక క్లస్టర్‌గా చేసి, ఉమ్మడిగా ఒక నర్సరీ ఉండేలా వెంటనే పనులు ప్రారంభించాలి. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 'వీబీ-జీ రామ్ జీ' పథకం కింద నర్సరీల పెంపకాన్ని కూడా అనుసంధానించాం. ఈ పథకం ద్వారా లభించే నిధులు, ఉపాధి దినాలను సమర్థంగా ఉపయోగించుకుని, గ్రామీణ ప్రాంతాల్లో నర్సరీలను పెద్ద ఎత్తున అభివృద్ధి చేయాలి" అన్నారు.

ప్రజా ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లండి

పర్యావరణ పరిరక్షణ, అడవుల పెంపకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా చల్లడానికి 2.6 కోట్ల సీడ్ బాల్స్ సిద్ధం చేసినట్లు అటవీ శాఖ అధికారులు శ్రీ పవన్ కళ్యాణ్ గారికి తెలిపారు. ఈ వర్షాకాలంలోనే వీటిని అటవీ, ఖాళీ ప్రాంతాలలో వెదజల్లేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు వెల్లడించారు. కొండ కోనల్లో విత్తనాలను చల్లడానికి ఈసారి సుమారు 40 నుంచి 50 అత్యాధునిక డ్రోన్లను ఉపయోగిస్తున్నట్లు వివరించారు. ఈ ప్రణాళికపై స్పందించిన పవన్ కళ్యాణ్ గారు, సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమాన్ని కేవలం ప్రభుత్వ ఉద్యోగులకే పరిమితం చేయకుండా, సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేయాలి. విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజలను కలుపుకొని దీనిని ఒక ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

అరుదైన మొక్కల సంరక్షణపై అభినందనలు

రాష్ట్రంలో అంతరించిపోతున్న అరుదైన వృక్ష జాతులను రక్షించేందుకు అటవీ శాఖ తీసుకుంటున్న ప్రత్యేక చర్యలపై శ్రీ పవన్ కళ్యాణ్ గారు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు అటవీ శాఖ ఉన్నతాధికారులైన పీసీసీఎఫ్, హెచ్ఓఎఫ్ఎఫ్ లను, వాళ్ల బృందాలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో పాములేరు వాగు వెంబడి కేవలం 10 మాత్రమే మిగిలి ఉన్న అత్యంత అరుదైన, అంతరించిపోతున్న వెదురు జాతిని అధికారులు గుర్తించారు. క్షేత్రస్థాయిలో చేసిన లోతైన పరిశోధనలు, ఆధునిక మాలిక్యులర్ సైన్స్ ద్వారా ఈ కొత్త జాతిని గుర్తించారు. దీనికి 'బాంబూసా ఆంధ్రికమ్' అని నామకరణం చేశారు. ఈ చివరి పది మొక్కలను కాపాడటమే కాకుండా, వాటి సంఖ్యను మరింత పెంచేందుకు అటవీ శాఖ ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయడం పట్ల అభినందించారు. అదేవిధంగా, శేషాచలం అడవుల్లో మాత్రమే కనిపించే, ప్రస్తుతం అంతరించిపోయే దశకు చేరిన ఈత చెట్టు మాదిరి ఉండే 'సైకాస్ శేషాచలన్సిస్' మొక్కల పెంపకానికి, వాటి సంరక్షణకు కూడా అటవీ శాఖ పటిష్టమైన ఏర్పాట్లు చేస్తుందని తెలుసుకొని అభినందించారు. కార్యక్రమంలో అటవీ పర్యావరణశాఖల ముఖ్యకార్యదర్శి శ్రీ కాంతిలాల్ దండే, ఆర్థిక శాఖ కార్యదర్శి శ్రీ వినయ్ చంద్, పీసీసీఎఫ్ శ్రీ పి.వి.చలపతిరావు, అటవీశాఖ సలహాదారు శ్రీ మల్లికార్జునరావు, సీసీఎఫ్ సోషల్ ఫారెస్ట్, జూలాజికల్ పార్క్స్ శ్రీ. బి.ఎన్.ఎన్. మూర్తి, సీసీఎఫ్ వైల్డ్ లైఫ్ శ్రీ ఎన్. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కన్నా మడకల మునిస్వామి భూమి కొలతల వివాదం

### అధికారుల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి



**ఓర్వకల్ ప్రతినిధి, జూన్ 18 (రిపబ్లిక్ న్యూస్)**
ఓర్వకల్ మండలం కన్నమడకల గ్రామం నివాసి అయిన ఎస్సీ మాల మునిస్వామి సన్నాఫ్ గోకారి వీళ్ళ భూమి సర్వే నెంబర్ 77. విస్తరణం 1.46 సెంట్లుగల భూమి కోర్టు జడ్జిమెంట్ ఉన్నది కోర్టు వారే వచ్చి మునిస్వామికి రిజిస్టర్ చేయడం జరిగింది గతంలో సర్వే రిపోర్ట్ కూడా ఉన్నది భూమి ఎక్కువ తక్కువలు ఉన్నాయని ఓర్వకల్ఎమ్మార్వో విద్యాసాగర్ కి రేపటినేషన్ ఇవ్వడం జరిగింది.ఎమ్మార్వో ఎమ్మెస్ వీఎస్ ఎండ చేయడం జరిగింది మండల సర్వే మాణిక్యం సార్ ఎమ్మార్వో చెప్పిన నేను కొలతలు కొలువనుచెప్పడం జరుగుతుంది జిల్లా ఎడి చెప్పిన కూడా మండల సర్వేయర్ విలేజ్ సర్వేరు శివ సాయికొలతలు భూమి కొలతలు కొలుసము అని చెప్పడం జరుగుతుంది ఆర్టికల్ 14 ప్రకారంగా చట్టం ముందు అందరు సామానులే కలెక్టర్ ఆరు పెద్దవారైన వీరిపై చట్టపైన చర్యలు తీసుకొని మునిస్వామికి న్యాయం చేయవలసిందిగా కోరుచున్నాము.

## కుటుంబ ప్రయోజన కారులను జారీ

**ఓర్వకల్లు ప్రతినిధి, జూన్ 18(రిపబ్లిక్ న్యూస్)**
ఓర్వకల్లు మండల గ్రామాలలోకుటుంబ ప్రయోజన కార్డులు జారీ చేయు నిమిత్తము సచివాలయ సిబ్బంది ద్వారా సమగ్ర కుటుంబ సర్వే ని జనవరి డిసెంబరు 14వ తేదీ నుండి ఏప్రిల్ వరకు చెప్పడం జరిగినది ఈ సర్వేలో ద్వారా రాబోకాలంలో ప్రజలకు ఏ పథకం కింద అర్హులవుతారో ఆ పథకం ద్వారా ఆర్థిక సహాయం చేయుటకు నిర్దేశించబడినది కావున ఈ యొక్క సర్వేకు సంబంధించిన సమాచారం అంతయు గురువారం రోజున సచివాలయం నందు అందుబాటులో ఉంచడం జరిగినది, ఈ యొక్క జాబితాను పరిశీలించిన నిమిత్తము 19626వ తేదీ గ్రామసభలు ఏర్పాటు చేయడం జరిగినది కావున ప్రజలందరూ గ్రామసభకు హాజరై మీ యొక్క వ్యక్తిగత వివరములను పరిశీలించుకోవలసినదిగా కోరడమైనది ఒకవేళ మీ యొక్క వివరాలలో ఏదైనా తప్పులు దొర్లిన ఎడల వాటిని సవరించు కొను నిమిత్తము 19వ తేదీ నుండి 24వ తేదీ వరకు ఫిర్యాదులు సచివాలయం నందు స్వీకరించడం జరుగును. 27వ తేదీలోగా సంబంధిత మండల అధికారుల పరిశీలన అనంతరం మీ యొక్క సమాచారం అప్డేట్ చేయడం జరుగుతుంది ఓర్వకల్లు మండలం ఎంపీడీవో నాగ అనసూయ తెలిపారు

## బీసీ హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

### రాష్ట్ర అధ్యక్షుడు సాకే నరేష్




**అనంతపురం ప్రతినిధి, జూన్ 18,(రిపబ్లిక్ న్యూస్):**
బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సాకే నరేష్ హాజరయ్యారు.
ఈ సందర్భంగా సాకే నరేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా బీసీలకు చేసింది ఏమీ లేదని విమర్శించారు.రాష్ట్రంలో బీసీ కార్పొరేషన్లకు నిధులు కేటాయించకుండా కేవలం చైర్మన్లు, డైరెక్టర్ల నియామకాలకే పరిమితమైందని, కార్పొరేషన్లు దిష్టిబొమ్మల్లా మారిపోయాయని ఆయన ఆరోపించారు. ఎన్నికల సమయంలో బీసీల మద్దతుతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.
ఎన్నికల సమయంలో ప్రకటించిన 50 సంవత్సరాలు దాటిన వారికి పెన్షన్, నిరుద్యోగ భృతి, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఆర్థిక సహాయం, ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల, ఆదరణ పథకం అమలు, పేదలను "పూర్ టు రిచ్" చేసే హామీల్లో ఒక్కటీ అమలు కాలేదని సాకే నరేష్ దుయ్యబట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేకపోతే బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.ఈ సమావేశంలో సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేష్, ఉపాధ్యక్షుడు మధు, సహాయ కార్యదర్శి కదిరిప్ప, మురళి, వెంకటేష్, రామ్మోహన్, లింగమయ్య, శ్రీరాములు, నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కళాశాల ఆకస్మిక తనిఖీ


### సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం -అదనపు డీఎంఈ హామీ





**అనంతపురం వైద్యం, జూన్ 18,( రిపబ్లిక్ న్యూస్ ):**
ఆంధ్రప్రదేశ్ అదనపు వైద్య విద్యా సంచాలకులు, సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్ కె.వి. సత్యనారాయణ మూర్తి గురువారం ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఉదయం సర్వజన ఆసుపత్రిని, మధ్యాహ్నం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని, సాయంత్రం ప్రభుత్వ వైద్య కళాశాలను పరిశీలించి అక్కడి పరిస్థితులను సమీక్షించారు.
అనంతరం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య డాక్టర్ ఎం. విజయశ్రీ, సూపరింటెండెంట్ ఆచార్య డాక్టర్ మల్లేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అన్ని విభాగాల ప్రధానాధిపతులు, వైస్ ప్రిన్సిపాళ్లతో సమావేశమయ్యారు. ఆసుపత్రి, కళాశాలలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.బెడ్ల సంఖ్య పెంపు, సరిపడా గదుల లేమి, వైద్య పరికరాల కొరత తదితర అంశాలను వైద్యులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిశీలించి, వీలైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని డాక్టర్ సత్యనారాయణ మూర్తి హామీ ఇచ్చారు. సమావేశంలో అన్ని విభాగాల ప్రధానాధిపతులు, వైస్ ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

## గుత్తి ఆర్ఎస్ రెండవ వార్డులో ఎస్ఆర్ఐ ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమం



**అనంతపురం /గుత్తి జూన్18 (రిపబ్లిక్ న్యూస్):**
గుత్తి పట్టణం లోని ఆర్ఎస్ రెండవ వార్డులో నిర్వహించిన ఎస్ఆర్ఐ ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమంలో గుత్తి పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి, రెండవ వార్డ్ ఇంచార్జ్ రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా పరిశీలన, అర్హులైన ఓటర్ల నమోదు, వివరాల సవరణ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని, తప్పులు ఉన్నట్లయితే వెంటనే సవరించుకోవాలని ఆయన సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ఓటరు జాబితా కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో టి ఎన్ ఎస్ ఎఫ్ ఉపాధ్యక్షుడు అరవింద్ యాదవ్, స్టోర్ డీలర్ భరత్, ధనాపాల్,స్థానిక నాయకులు, బూత్ స్థాయి అధికారులు, కార్యకర్తలు మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# నడిమివంక ఆక్రమణల తొలగింపు వేగం

### ఎమ్మెల్యే దగ్గుపాటి ఫోకస్ -కమిషనర్ జస్వంత్ కుమార్‌తో కలిసి పనుల పరిశీలన





**అనంతపురం సంక్షేమం, జూన్ 18,(రిపబ్లిక్ న్యూస్):**
అనంతపురం నగరంలోని 9 డివిజన్లు, 18 కాలనీల ప్రజలు మూడు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న వరద ముప్పుకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. నడిమివంకపై జరిగిన ఆక్రమణల కారణంగా వర్షపు నీరు సాఫీగా ప్రవహించక కాలనీల్లోకి చేరుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు.గత వారం రోజులుగా నడిమివంకపై ఉన్న ఆక్రమణలను తొలగిస్తూ, పూడికతీత పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. గౌరవ్ గార్డెన్స్ ప్రాంతంలో జరుగుతున్న పనులను మున్సిపల్ కమిషనర్ జస్వంత్ కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు, టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికి దశాబ్దాల సమస్య పరిష్కారానికి కృతజ్ఞతలు తెలిపారు.

**నీటి ప్రవాహానికి ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు**
ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ నగర జనాభా పెరుగుతున్న నేపథ్యంలో డ్రైనేజీ వ్యవస్థను కూడా ఆధునిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో జరిగిన నిర్లక్ష్యంతో వంకలపై ఆక్రమణలు పెరిగి నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడిందని చెప్పారు. ఫలితంగా వర్షాకాలంలో 18 కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.వంకలపై ఉన్న అన్ని ఆక్రమణలను తొలగించి నీటి ప్రవాహానికి ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, నగరంలో ఎక్కడ ఆక్రమణలు ఉన్నా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ప్రజల భవిష్యత్ ప్రయోజనాల దృష్ట్యా చేపడుతున్న ఈ చర్యలకు అందరూ సహకరించాలని కోరారు. " ఇది ప్రజల కోసం పని చేసే ప్రభుత్వం " అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

**వంకలపై ఉన్న ఆక్రమణలను తొలగిస్తున్నాం**
మున్సిపల్ కమిషనర్ జస్వంత్ కుమార్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే సహకారంతోనే ఈ పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. వేసవికాలంలో కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టామని, ప్రస్తుతం వంకలపై ఉన్న ఆక్రమణలను తొలగిస్తున్నామని చెప్పారు. ఇవి ఇరిగేషన్ శాఖ పరిధిలోని కాల్వలైనా ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ నిధులతో పనులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.ప్రస్తుతం వంకలపై ఉన్న ఆక్రమణలను తొలగించిన అనంతరం రోడ్లు, డ్రైన్లపై ఉన్న అక్రమ నిర్మాణాల తొలగింపుపై దృష్టి సారిస్తామని, ప్రజల ప్రయోజనాల కోసం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ జస్వంత్ కుమార్ స్పష్టం చేశారు.

# కర్నూలులో వైసీపీ అరాచకాలపై టీడీపీ ఆగ్రహం..

**గాయపడిన కార్యకర్తలను పరామర్శించిన నేతలు**

**నగర శాంతి భద్రతలను దెబ్బతీసే చర్యలకు స్వస్తి పలకాలని వైసీపీకి విజ్ఞప్తి**

**జిల్లా ప్రధాన కార్యదర్శి పి. నాగరాజు యాదవ్, నగర అధ్యక్షుడు కొరకంచి రవి**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 18)**
కర్నూలు నగరంలో ఇటీవల చోటుచేసుకున్న దాడుల ఘటనల నేపథ్యంలో గాయపడి చికిత్స పొందుతున్న తెలుగుదేశం పార్టీ కార్యకర్త తైజుం బాషాను ఆయన నివాసంలో, అలాగే వ్యక్తిగత కారణాలతో దాడికి గురై స్టార్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహమ్మద్ నవీన్‌ను జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి పి. నాగరాజు యాదవ్, నగర అధ్యక్షుడు కొరకంచి రవి కుమార్, రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ మన్సూర్ అలీ ఖాన్, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి వి. రాజశేఖర్ రెడ్డి తదితర నాయకులు పరామర్శించారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కర్నూలు నగరం శాంతి, సామరస్యాలకు మారుపేరుగా నిలిచిందని, అలాంటి నగరంలో గత కొద్ది రోజులుగా వైసీపీ నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం ఉద్రిక్త పరిస్థితులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారు విజ్ఞప్తి చేశారు. రాజకీయాల్లో హింసకు, హత్యలకు తావు లేదని పేర్కొన్న టీడీపీ నేతలు, వైసీపీ నాయకత్వం హింసాత్మక రాజకీయాలను ప్రోత్సహిస్తోందని విమర్శించారు. కర్నూలు నగరంలో శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని, రాజకీయ విభేదాలను హింసాత్మక మార్గాల్లో కాకుండా ప్రజాస్వామ్య పద్ధతుల్లో పరిష్కరించుకోవాలని సూచించారు.
నగరంలో ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు వైసీపీ నాయకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని టీడీపీ నాయకులు కోరారు.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పిలుపు**

**యోగాంధ్ర కార్యక్రమంలో మత్తు పదార్థాల నిరోధక ప్రతిజ్ఞ..**

**గుట్కా, గంజాయి, డ్రగ్స్ రవాణా-వినియోగాన్ని అరికట్టాలని అవగాహన**








**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 18)**
ప్రజలు మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, వాటి వినియోగం మరియు రవాణాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పిలుపునిచ్చారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన థీమాటిక్ యోగా కార్యక్రమంలో కలెక్టర్ ఆదేశాల మేరకు సెట్కూర్ సీఈవో డాక్టర్ వేణుగోపాల్ పాల్గొన్న వారితో మత్తు పదార్థాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా ఈగల్ టీం సభ్యులు గుట్కా, గంజాయి, అఫీమ్, ఎండీఎంఏతో పాటు ఇతర మాదకద్రవ్యాల వినియోగం, రవాణా ప్రమాదాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు ఎవరూ బానిసలు కాకూడదని, వాటి వ్యాప్తిని అరికట్టేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ప్రతిజ్ఞలో పేర్కొన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, రీజనల్ టూరిజం అధికారి లక్ష్మీనారాయణ, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రఘు, సెట్కూర్ సీఈవో డాక్టర్ వేణుగోపాల్, ఎస్ఏపీ క్యాంపు డీఎస్పీ మహబూబ్ బాషా, ఆయుష్ జిల్లా యోగా నోడల్ అధికారి డాక్టర్ అమర్నాథ్, ఆయుష్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రసాద్, యోగా రాష్ట్ర కార్యదర్శి అవినాష్, కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 24న సీఎం చంద్రబాబు కర్నూలు పర్యటన..

**జొన్నగిరి గోల్డ్ మైన్స్‌లో భూమిపూజ, బహిరంగ సభ**

**పకడ్బందీ ఏర్పాట్లకు కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి ఆదేశాలు -అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచన**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 18)**
కర్నూలు జిల్లాలో జూన్ 24న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.
సీఎం తొలుత హెలిప్యాడ్‌కు చేరుకుని జొన్నగిరిలోని జియో మైసూర్ గోల్డ్ మైన్స్‌ను సందర్శించనున్నారు. ఈ సందర్భంగా భూమిపూజ, బంగారం పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొని ప్లాంట్‌ను పరిశీలించిన అనంతరం బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు.
పర్యటనలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. హెలిప్యాడ్, రహదారులు, బారికేడింగ్, పార్కింగ్, తాగునీరు, విద్యుత్, ఇంటర్నెట్, పారిశుద్ధ్యం, లైటింగ్, సౌండ్ సిస్టమ్, ఎల్ఈడీ స్క్రీన్లు, మొబైల్ టాయిలెట్లు, వైద్య శిబిరాలు తదితర ఏర్పాట్లను సంబంధిత శాఖలు పూర్తి చేయాలని ఆదేశించారు.
అలాగే వ్యవసాయం, పీఎండీఎస్, డ్రిప్ ఇరిగేషన్, జలధారజలహారతి, స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్ర, డీఆర్డీఏ, స్కిల్ డెవలప్మెంట్ వంటి కార్యక్రమాల విజయాలను ప్రతిబింబించే ప్రదర్శన స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. వీవీఐపీ, వీఐపీ అతిథుల కోసం ప్రత్యేక సీటింగ్, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు, సభకు హాజరయ్యే ప్రజలకు భోజన సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

# కామ్రేడ్ మర్తాడు రామిరెడ్డి ఆశయాలు కొనసాగిస్తాం

### రాష్ట్ర అధ్యక్షుడు ఇండ్ల ప్రభాకర్ రెడ్డి








**అనంతపురం / గార్లదిన్నె, జూన్ 18,(రిపబ్లిక్ న్యూస్)**
కామ్రేడ్ మర్తాడు రామిరెడ్డి ఆశయాలు కొనసాగిస్తామని
ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఇండ్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. గురువారం శింగనమల నియోజకవర్గంలోని గార్లదిన్నె లో కామ్రేడ్ రాంరెడ్డి ప్రాంగణంలో ఏఐకేఎంఎస్
జిల్లా మహాసభలు ఘనంగా నిర్వహించారు. ముందుగా కాసిం జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం సభకు సి నాగరాజు అధ్యక్షత వహించారు. ఓపిడిఆర్ రాష్ట్ర కార్యదర్శి ఆర్ . రామ కుమార్ ప్రారంభ ఉపన్యాసం చేశారు.

**రైతు కూలీలకు రోజువారీ వేతనాన్ని రూ.700లకు పెంచాలి**

ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఇండ్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు పంటల బీమా అమలు చేయాలని, రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం కింద రైతు కూలీలకు ఏడాది పొడవునా పని కల్పించాలని, రోజువారీ వేతనాన్ని రూ.700లకు పెంచాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ బకాయిలను వెంటనే చెల్లించాలని, దున్నేవారికే భూమి దక్కేలా చర్యలు తీసుకోవాలని, రైతుల ఆత్మహత్యలను అరికట్టేలా సమగ్ర విధానాలను అమలు చేయాలని పేర్కొన్నారు.

**రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలవాలి**

రాయలసీమ ప్రాంతానికి 400 టీఎంసీల నీటిని కేటాయించాలని, హంద్రీ-నీవా కాలువ సామర్థ్యాన్ని 10 వేల క్యూసెక్కులకు పెంచాలని, హెచ్‌ఎల్‌సీకి సమాంతర కాలువ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాయలసీమ రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలవాలని, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొని రైతు, కూలీల సమస్యలపై ప్రసంగించారు.

**అనంతపురం జిల్లా నూతన కమిటీ ఎన్నిక**

సభలో ఏఐకేఎంఎస్ అనంతపురం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఈ. రాయుడు, ప్రధాన కార్యదర్శిగా పి. కృష్ణ, ఉపాధ్యక్షుడిగా తరిమెల రామాంజనేయులు, సహాయ కార్యదర్శిగా గుంతకల్లు రామాంజనేయులు, కోశాధికారిగా కనేకల్ మల్లయ్య ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా పామిడి రంగనాయకులు, వెంకటేశులు, కనేకల్ దాదావలి, ఎం. ఈరన్న, కూడేరు సంజప్ప, సింగనమల లక్ష్మీరంగయ్యలను ఎన్నుకున్నారు. అదే సభలో సత్యసాయి జిల్లా తాత్కాలిక కమిటీని కూడా ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా పి. కాశీం, ప్రధాన కార్యదర్శిగా సి. నాగరాజు ఎన్నిక కాగా, చెర్లోపల్లి చంద్ర, నారాయణపురం కృష్ణ, మోటర్‌పల్లి సుబ్బరాయుడు, మునిమడుగు శేఖర్, చిన్నపురెడ్డిపల్లి నరసింహులు, ఓబులదేవచెరువు సుధాకర్, గోరంట్ల సురేష్‌బాబు, రామగిరి గంగాధర్, కొత్తచెరువు కళావతి తదితరులు కమిటీ సభ్యులుగా ఎంపికయ్యారు.

# నెగటివ్ పబ్లిక్ పర్సెప్షన్ అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన ప్రాజెక్టు డైరెక్టర్ పి. విజయ





**ఎమ్మిగనూరు, జూన్, 18,(రిపబ్లిక్ న్యూస్ ):**
కర్నూలు జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ పి. విజయ జిల్లాలో నెగటివ్ పబ్లిక్ పర్సెప్షన్ గా గుర్తించబడిన అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం తనిఖీ చేశారు.
సందర్భంగా కోసిగి మండలంలోని గొడగల్లు అంగన్‌వాడీ కేంద్రం, మంత్రాలయం మండలంలోని వగరూరు-3 అంగన్‌వాడీ కేంద్రం, నందవరం మండలంలోని హాలహర్వి-2 అంగన్‌వాడీ కేంద్రం, గోనెగండ్ల మండలంలోని కున్నూరు-2 అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి కేంద్రాల పనితీరు, లబ్ధిదారులకు అందుతున్న సేవలను సమీక్షించారు.
తనిఖీల సందర్భంగా ప్రీ-స్కూల్ పిల్లల హాజరు, గర్భిణీలు, బాలింతలు, 6 నెలల నుండి 3 సంవత్సరాల లోపు పిల్లల వివరాలు, పోషకాహార పంపిణీ, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. కేంద్రాలకు హాజరు కాని పిల్లల వివరాలను సేకరించి, తల్లిదండ్రులతో సంప్రదింపులు జరిపి పిల్లలను క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే అర్హులైన గర్భిణీలు, బాలింతలు మరియు చిన్నారులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలని, రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని, కేంద్రాలలో ప్రీ-స్కూల్ కార్యకలాపాలను మరింత మెరుగుపరచాలని అంగన్‌వాడీ కార్యకర్తలు మరియు సూపర్వైజర్లను ఆదేశించారు.
అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రజల్లో సానుకూల అవగాహన పెంపొందించేందుకు నాణ్యమైన సేవలు అందించాలని, బాలల పోషణ, ఆరోగ్యం మరియు ప్రాథమిక విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీమతి పి. విజయ సూచించారు.
ప్రాజెక్ట్ డైరెక్టర్ పి. విజయ గారితో పాటు సి డి పి ఓ సఫరున్నిసా బేగం , సూపర్ వైజర్స్ నాగలక్ష్మి, భాగ్యలక్ష్మి, సురేఖ పాల్గొన్నారు

# భూకబ్జాల బారి నుంచి ప్రజలను కాపాడండి

### కలెక్టర్ కు మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి ఫిర్యాదు - ఆధారాలతో త్వరలో సీఎం చంద్రబాబును కలుస్తా

**అనంతపురం కలెక్టరేట్, జూన్ 18,(రిపబ్లిక్ న్యూస్):**
నగరంలో కొందరు భూ కబ్జాలకు పాల్పడుతున్నారని, భూకబ్జాల బారి నుంచి ప్రజలను కాపాడాలని
మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు భూములను కొందరు దౌర్జన్యపరులు అక్రమంగా ఆక్రమిస్తూ సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని గురువారం ప్రభాకర్ చౌదరి జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.
జిల్లాలో ఇటీవల భూముల ఆక్రమణలు, రికార్డుల మార్పులు, బాధితులపై ఒత్తిళ్లు పెరిగిపోయాయని, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడం లేదని ఆయన పేర్కొన్నారు. భూములను కాపాడుకోవాలనే ప్రయత్నం చేస్తున్న సామాన్య ప్రజలను బెదిరింపులకు గురిచేస్తున్నారని, ఈ పరిస్థితుల్లో బాధితులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని కోరారు.

**ప్రజల ఆస్తులను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలి**

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న భూకబ్జాల వెనుక కొందరు ప్రభావశీల



వ్యక్తులు, దౌర్జన్యపరుల హస్తం ఉందని ఆరోపించారు. భూములను కబ్జా చేసేందుకు నకిలీ పత్రాలు సృష్టించడం, బాధితులను బెదిరించడం వంటివి జరుగుతున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై జిల్లా యంత్రాంగం సమగ్ర విచారణ చేపట్టి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భూకబ్జాల కారణంగా పేదలు, మధ్యతరగతి కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని, అనేక మంది తమ సొంత భూములను కాపాడుకోవడానికి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు. దౌర్జన్యపరుల కారణంగా ప్రజలు న్యాయం కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో జరుగుతున్న భూకబ్జాలకు సంబంధించిన పూర్తి వివరాలు, ఆధారాలు తన వద్ద ఉన్నాయని, అవసరమైతే త్వరలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని స్వయంగా కలిసి పరిస్థితిని వివరిస్తానని వైకుంఠం ప్రభాకర్ చౌదరి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆస్తులను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని కోరారు.
మాజీ ఎమ్మెల్యే చేసిన ఆరోపణలు జిల్లాలో రాజకీయంగా సంచలనంగా మారాయి. భూకబ్జాల అంశంపై ఆయన కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం, ముఖ్యమంత్రిని కలుస్తానని ప్రకటించడం జిల్లాలో ఆసక్తికర చర్చకు దారితీసింది. ఈ వ్యవహారంపై జిల్లా యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

# ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల పేరుతో దోపిడీ జరుగుతోంది

### : కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు మీసాల సుమలత

### అనుమతులు లేకుండా యూనిఫాంలు, పుస్తకాలు, బూట్ల విక్రయాలు నిలిపివేయాలి

### పాఠశాలల పాలక మండళ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్




**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 18)**
ప్రైవేటు పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా విద్యార్థులకు అవసరమైన యూనిఫాంలు, పుస్తకాలు, బూట్లు తదితర వస్తువులను విక్రయిస్తూ తల్లిదండ్రులను ఆర్థికంగా దోపిడీ చేస్తున్నారని జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు మీసాల సుమలత ఆరోపించారు.
జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, బహిరంగ మార్కెట్‌లో తక్కువ ధరలకు లభించే వస్తువులను కొనుగోలు చేయకుండా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకువస్తున్నాయని విమర్శించారు. పాఠశాలలకు అనుబంధంగా నిర్వహిస్తున్న దుకాణాల ద్వారా అధిక ధరలకు వస్తువులను విక్రయించడం అన్యాయమని అన్నారు.
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రైవేటు పాఠశాలల దోపిడీని అరికట్టడంలో విఫలమయ్యారని ఆమె ఆరోపించారు. జీవో నెం.1 ప్రకారం తల్లిదండ్రులు, విద్యాశాఖ అధికారులు మరియు యాజమాన్య ప్రతినిధులతో పాఠశాల పాలక మండళ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.
ప్రైవేటు పాఠశాలల్లో జరుగుతున్న అక్రమ వసూళ్లు, దోపిడీపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, అలాగే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమైన "విద్యార్థి మిత్ర" కిట్లను త్వరితగతిన అందజేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అత్తర్ బి, తహరాబి, ముంతాజ్ బి, షబానా, జాఫర్ బి, లతీఫ్ బాయ్ తదితరులు పాల్గొన్నారు.

# రెండేళ్ల సుపరిపాలనతో స్వర్ణాంధ్ర దిశగా కూటమి ప్రభుత్వం: చింతా సురేష్ బాబు

### పాణ్యం నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ కారిడార్‌తో యువతకు ఉపాధి అవకాశాలు అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రం ముందంజ



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 18)**రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా పాణ్యం నియోజకవర్గం ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన "సుపరిపాలన స్వర్ణాంధ్రప్రదేశ్ సభ" కర్నూలు నగరంలోని ఏఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జనసేన పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా కోఆర్డినేటర్, పాణ్యం నియోజకవర్గ ఇన్‌చార్జ్ చింతా సురేష్ బాబు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నట్లు తెలిపారు. పాణ్యం నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు జిల్లా అభివృద్ధికి కీలకమని పేర్కొన్న ఆయన, పరిశ్రమల్లో స్థానిక యువతకు అధికంగా ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ దేశంలో 24వ స్థానంలో ఉండేదని, కేవలం రెండేళ్లలోనే ఆ శాఖను దేశంలో మొదటి స్థానానికి తీసుకువచ్చిన ఘనత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్కు దక్కుతుందని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తోడ్పాటుతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, హామీల అమలులో వేగంగా ముందుకు సాగుతోందని చింతా సురేష్ బాబు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సుపరిపాలన అందిస్తూ, స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్య సాధన దిశగా కృషి చేస్తోందని ఆయన అన్నారు.

# విద్యార్థి ప్రతిభకు ఎస్సై చేయూత

### విద్యే సామాజిక అభివృద్ధికి ప్రధాన ఆయుధం -ఎస్సై లోకేష్ కుమార్



**అనంతపురం / కంబదూరు, జూన్ 18,(రిపబ్లిక్ న్యూస్):**
అనంతపురం జిల్లా కంబదూరు మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన ముత్యాలప్ప కుమారుడు గులగానప్ప పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 600 మార్కులకు గాను 568 మార్కులు సాధించాడు. సత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గంలోని రొళ్ళ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో చదువుతున్న గులగానప్ప పేద కుటుంబానికి చెందిన విద్యార్థి కావడంతో అతని ప్రతిభను గుర్తించిన కంబదూరు ఎస్సై లోకేష్ కుమార్ అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థికి తన వంతు ప్రోత్సాహంగా రూ.5 వేల నగదు ఆర్థిక సాయం అందజేశారు. ఎస్సై లోకేష్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్య ద్వారా వ్యక్తిగత, సామాజిక, ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన యువతకు చైతన్యం కలిగించే ప్రధాన ఆయుధం చదువేనని అభిప్రాయపడ్డారు. తాను ఎక్కడ విధులు నిర్వహించినా పేద విద్యార్థులకు తన జీతంలో కొంత భాగాన్ని కేటాయించి వారి విద్యాభివృద్ధికి తోడ్పడతానని తెలిపారు. పోలీసు అధికారిగా విధులు నిర్వర్తిస్తూ సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న ఎస్సై లోకేష్ కుమార్ సేవలను స్థానికులు అభినందించారు.

# పిల్లలకు విద్యా ఉపయోగకర వస్తువులు పంపిణీ

### - పదిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి లాప్టాప్ పంపిణీ



**చౌడేపల్లి ప్రతినిధి జూన్ 18 రిపబ్లిక్ న్యూస్**
మండలంలోని పంచాయతీ కేంద్రం వెంగళపల్లి పాఠశాలకు చెందిన పిల్లలకు విద్య ఉపయోగ వస్తువులు పంపిణీ చేశారు గ్రామానికి చెందిన నరసింహులు అతని కుమారుడు కుమారస్వామిల ఆధ్వర్యంలో ఎంఈఓ కేశవరెడ్డి పిల్లలకు నోటు పుస్తకాలు పెన్నులు పలు విద్యా ఉపయోగకర వస్తువులను పంపిణీ చేశారు అదేవిధంగా ఇటీవల జరిగిన 10 ఫలితాలలో 578 మార్కులు సాధించిన వెంగళపల్లికి చెందిన జోష్నకు 60 వేలు విలువచేయు ల్యాప్టాప్ ను బహుకరించారు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులు పాఠశాలకు మంచి పేరు తేవాలని ఈ సందర్భంగా వక్తలు అన్నారు. ఇదే పాఠశాలలో 23 సంవత్సరములు పనిచేసే అందరిలోనూ మంచి పేరు తెచ్చుకున్న ఉపాధ్యాయుడు నాగరాజును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు లక్ష్మి నరసయ్య, నరసింహులు, ఓబులేసు, నాగేంద్ర ,ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజా రిపబ్లిక్

శుక్రవారం 19 జూన్ 2026

# మొక్కలని పరిరక్షించి పర్యావరణహితం కోసం
# ప్రతి ఒక్కరు నడుం బిగించాలి

**మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు**

**భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి**

**కలెక్టర్ ప్రతి మాసింగ్**

**ఘనం గా ప్రారంభం అయిన వన మహోత్సవం**





**మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 18 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
మెదక్ జిల్లా రామాయణపేట మండలం అక్కన్నపేట మన యోజన పార్క్ ప్రారంభించిన మెదక్ ఎంపీ రఘునందన్ రావు, జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్
మొక్కలని పరిరక్షించి పర్యావరణహితం కోసం ప్రతి ఒక్కరు నడుం బిగించాలని. మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావుఅన్నారు.

గురువారం జిల్లాలోని రామాయణపేట మండలం అక్కన్నపేట వన యోజన పార్కు అటవీ ప్రాంతంలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ , డిఎఫ్ఓ జో.జి , డిఆర్డిఓ పిడి శ్రీనివాసరావు, తాసిల్దార్ రజిని , ఎంపీడీవో , సర్పంచ్చి యాదగిరి లతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మెదక్ ఎంపీ మాధవని రఘునందన్ రావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అక్కన్నపేట పార్కుకు రెండు కోట్లు మంజూరు చేసిందన్నారు. ఇప్పటి వరకూ కోటి నలభై లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో నేడు ప్రారంభించనున్న 11 పార్కులకు 22 కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు. వనాలను రక్షించాలన్నారు. మొక్కలని పరిరక్షించి పర్యావరణహితం కోసం ప్రతి ఒక్కరు నడుం బిగించాలన్నారు. 765 డీజి రోడ్డులో మొదటి దశలో 20 వేల మొక్కలు నాటేందుకు జూలైలో ప్రణాళిక చేయాలని అధికారులకు సూచించారు.
జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ
భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని తెలిపారు.
శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో కృషి చేసి మొక్కలు నాటి సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో మొక్కలు నాటడం జరిగిందని తెలిపారు. 2026 వనమహోత్సవంలో జిల్లాకు కేటాయించిన 31 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో సాధించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా నర్సరీలలోని మొక్కల వివరాలను, ప్లాంటేషన్ చేసే సైట్ల రిజిస్ట్రేషన్, సంబంధిత వివరాలను కేటాయించబడిన ఆన్లైన్ పోర్టల్ లో నమోదు చేయాలని తెలిపారు. మొక్కలు నాటిన తర్వాత జియో ట్యాగింగ్ పూర్తి చేసి, రోజువారీగా వివరాలను నవీకరించాలని తెలిపారు. రహదారులకు ఇరుప్రక్కల పెద్ద చెట్లు నాటాలని, నాటిన ప్రతి ఒక్క మొక్క ఎదిగేలా సంరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల ఆవరణలో పూలు, పండ్ల మొక్కలు నాటాలని, జిల్లాలో గనులు దృష్ట్యా ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నాయని, ఖాళీ ప్రదేశాలలో మొక్కలు నాటడం ద్వారా ఉష్ణోగ్రతలు అదుపులో ఉంటాయని తెలిపారు.అంతకుముందు అక్కన్నపేట వన యోజన వన యోజన పార్కును ప్రారంభించిన అనంతరం అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్ను తిలకించి
మెదక్ ఎంపీ గారితో కలిసి మొక్కలు నాటి
వన మహోత్సవాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శక ఓటరు జాబితా కోసం ఎన్నికల సంఘం

**ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్)**

**ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ప్రతిమాసింగ్ సూచించారు**





**మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 18 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్న ఎస్.ఐ.ఆర్ సర్వేను పురస్కరించుకుని మెదక్ జిల్లా పాపన్నపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సర్ ప్రోగ్రాం పై బిఎల్ఓ లకు బిఎల్ఏ లకు బి ఎల్ ఓ సూపర్వైజర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

గురువారం గ్రామీణ నియోజకవర్గ బూత్ లెవెల్ ఆఫీసర్లు, సూపర్వైజర్లు, సహాయ రిటర్నింగ్ అధికారులకు ఎస్.ఐ.ఆర్ సర్వే నిర్వహణ తీరుతెన్నులపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎస్.ఐ.ఆర్ సర్వే ఎలా చేయాలి, ఏయే అంశాలను పరిశీలించాలి, ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, పాటించాల్సిన పద్ధతులపై మాస్టర్ ట్రైనర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ కీలక అంశాలను వివరిస్తూ బీ.ఎల్.ఓలకు దిశానిర్దేశం చేశారు. ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 25 నుండి జూలై 24 వరకు బీఎల్ఏ లు ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఓటరు మ్యాపింగ్ ను పూర్తి చేయాలని సూచించారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ నిర్వహణలో పాల్గొంటున్న బీ.ఎల్.ఓలకు సర్వే కాలంలో నెల రోజుల పాటు వారివారి శాఖలకు సంబంధించిన దైనందిన విధుల నుంచి మినహాయింపు కల్పించారని కలెక్టర్ తెలిపారు.దీనిని దృష్టిలో పెట్టుకుని ఎస్.ఐ.ఆర్ పైనే పూర్తి స్థాయిలో దృష్టిని కేంద్రీకరిస్తూ, ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా పకడ్బందీగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు. ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఓటరు జాబితాలో పేర్లు ఉన్నవారు ఇతర ప్రాంతానికి శాశ్వతంగా వలస వెళ్ళారా, మృతి చెందారా, రెండు చోట్ల పేర్లు ఉన్నాయా అనే అంశాలను నిశితంగా గమనించాలని సూచించారు. ఎస్.ఐ.ఆర్ సర్వే వివరాల ఆధారంగానే ఓటరు జాబితాను రూపొందించనున్న దృష్ట్యా పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తగా సర్వే జరపాలని హితవు పలికారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలని, ఏవైనా సందేహాలు ఉంటే ఏమాత్రం సంకోచించకుండా శిక్షణ తరగతులలో నివృత్తి చేసుకోవాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ఒక్క ఓటరు కూడా తప్పిపోకుండా చూడాలని, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఇతర వి.ఐ.పీల మ్యాపింగ్ పై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓ.టీ.పీని ఇతరులకు తెలుపకుడదని, ఇలా చేయడం నేరంగా పరిగణించబడుతుందని జాగ్రత్తలు సూచించారు.
ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డిఓ రమాదేవి
సంబంధిత బూత్ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు

# రైతులు యూరియా యాప్ ద్వారానే బుక్ చేసుకోవాలి

**-మెదక్ జిల్లాలో యూరియా కొరత లేదు కలెక్టర్**



**మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 18( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
యూరియా కోసం రైతులు భారీ క్యూ లైన్లు కట్టవలసిన అవసరం లేదు.ప్రస్తుతం జిల్లాలో ప్రైవేట్ డీలర్స్ మరియు మార్క్ ఫెడ్ లో 6,300 మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టార్ట్ కలదు.
ప్రతి మండలంలో రెండు మూడు డీలర్ పాయింట్లు వద్ద యూరియా స్టాక్ అందుబాటులో ఉంచుతున్నా
రైతులు యూరియా విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించడమే ప్రభుత్వ లక్ష్యం.
పారదర్శక సేవలతో రైతుల విశ్వాసం పొందాల.
రైతులు యూరియా యాప్ ద్వారానే బుక్ చేసుకోవాలని, జిల్లాలో యూరియా కొరత లేదని, ప్రస్తుతం 6300 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో కలదని రైతులు యూరియా విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ గురువారం ఒక ప్రకటన ద్వారా స్పష్టం చేశారు.మెదక్ జిల్లాలో యూరియా సరఫరా విషయంపై కలెక్టర్ మాట్లాడుతూ యూరియా కోసం యాప్ రూపొందించడం జరిగిందని రైతులు ఇంటి వద్ద నుంచే యూరియాను బుక్ చేసుకుని సమయానికి అనుగుణంగా డీలర్స్ దగ్గరకు వెళ్లి అవసరానికి అనుగుణంగా యూరియా తీసుకువచ్చున్నారు.
యూరియా కోసం రైతులు భారీ క్యూ లైన్లు కట్టవలసిన అవసరం లేదని ప్రస్తుతం జిల్లాలో ప్రైవేట్ డీలర్స్, మార్క్ ఫెడ్ లో 6,300 మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టార్ట్ కలదనీ ప్రతి మండలంలో రెండు మూడు డీలర్ పాయింట్లు వద్ద యూరియా స్టాక్ అందుబాటులో ఉంచుతున్నాం అని వివరించారు. రైతులు సమన్వయం పాటిస్తూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉండేలా రైతు సేవ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలె సూచించారు.ఐకేపీ రైతు సేవా కేంద్రంలో విక్రయించే ఎరువులు, విత్తనాలు, పురుగుమందులకు సంబంధించిన లైసెన్సులను దుకాణంలో స్పష్టంగా కనిపించే విధంగా భద్రంగా ప్రదర్శించాలని ఆదేశించారు.
రైతులు కొనుగోలు చేసే వ్యవసాయ ఇన్‌పుట్‌లపై పూర్తి సమాచారం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.
రైతులకు ఎలాంటి నష్టాలు కలగకుండా నాణ్యమైన విత్తనాలు, ప్రమాణాలకు అనుగుణమైన ఎరువులు, పురుగుమందులను మాత్రమే విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.
నకిలీ (లేదా) నాసిరకం ఉత్పత్తులకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రైతుల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా సేవలు అందించాలన్నారు.
వ్యవసాయ రంగ అభివృద్ధిలో రైతు సేవా కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, రైతులకు నాణ్యమైన సేవలు అందించడం ద్వారా వ్యవసాయ ఉత్పాదకత పెంపునకు తోడ్పడాలని కలెక్టర్ సూచించారు.

# పేదలందరికీ ఇళ్లు అందించడమే లక్ష్యం

**ఇప్పటికే 15.54 లక్షల ఇళ్ల మంజూరు -మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడి**

**అమరావతిజూన్ 18( ప్రజా రిపబ్లిక్ న్యూస్)** కూటమి ప్రభుత్వం పేదలందరికీ ఇళ్లు అందించడమే లక్ష్యంగా పనిచేస్తోందని మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు 15.54 లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు.సీఎం చంద్రబాబు ఎప్పుడూ పేదల గృహ నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. అదే విధానాన్ని ఇప్పుడు మరింత వేగంగా అమలు చేస్తున్నామని వివరించారు. రెండేళ్ల గృహనిర్మాణ శాఖ ప్రగతిపై మంత్రి కొలుసు పార్థసారథి మీడియాతో మాట్లాడారు. వైసీపీ హయాంలో గృహ నిర్మాణానికి అవసరమైన నిధులు సరైన స్థాయిలో విడుదల చేయకపోవడంతో లక్షలాది మంది పేదలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆరోపించారు. వివిధ దశల్లో ఉన్న దాదాపు 4 లక్షల ఇళ్ల ప్రాజెక్టులు రద్దు చేశారని ప్రస్తావించారు. జగన్ హయాంలో నిలిపివేసిన గృహ నిర్మాణాలను తిరిగి ప్రారంభించి, ఇప్పటికే 4.50 లక్షల ఇళ్లను పూర్తి చేసి లబ్దిదారులకు తాళాలు అందించినట్లు మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. అదేవిధంగా మిగిలిన 4.14 లక్షల ఇళ్లను కూడా పూర్తిచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారని తెలిపారు. గృహ నిర్మాణ పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి దాన్ని రెండేళ్లు పొడిగించినట్లు స్పష్టం చేశారు. జగన్ హయాంలో పేదల ఇళ్ల కోసం సరైన నిధులు కేటాయించలేదని పేర్కొన్నారు. దాదాపు ఆరు లక్షల ఇళ్లకు కేవలం రూ.15 వేలే సహాయం ఇచ్చినట్లు తెలిపారు. 2014 నుంచి 2019 కాలంలో రాష్ట్ర వాటా రూ.50 వేలుగా ఉండగా, హుద్‌హుద్ తుఫాన్ తర్వాత విపత్తు సహాయంగా దాతల ద్వారా రూ.2 లక్షల వరకు నిధులు సమకూర్చినట్లు గుర్తుచేశారు.

# ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల విక్రయాలు

**చేస్తున్న మాస్టర్ మైండ్ పాఠశాలపై ఏఐఎస్ఎఫ్ ఆందోళన**

**అధికారుల చర్యలతో పుస్తకాల గది సీజ్**





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 18 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )** సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న మాస్టర్ మైండ్ పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు విక్రయిస్తున్నారనే సమాచారంతో అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. విద్యను వ్యాపారంగా మార్చుతూ విద్యార్థులు, తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం మోపే విధంగా పాఠశాల యాజమాన్యం వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ ఏఐఎస్ఎఫ్ నాయకులు పాఠశాల ముందు ధర్నాకు దిగారు.ఈ విషయాన్ని స్థానిక మండల విద్యాధికారి (ఎంఈఓ) దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి సీఆర్పీలను పాఠశాలకు పంపించారు. అధికారులు పాఠశాలలో తనిఖీలు నిర్వహించి పుస్తకాల విక్రయాలు జరుగుతున్న గదిని పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాల విక్రయం జరుగుతున్నట్లు గుర్తించి సంబంధిత గదిని సీజ్ చేశారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి దత్తు రెడ్డి మాట్లాడుతూ విద్య హక్కు చట్టం, విద్యాశాఖ మార్గదర్శకాలను తుంగలో తొక్కుతూ కొన్ని ప్రైవేట్ పాఠశాలలు విద్యను పూర్తిగా వ్యాపారంగా మార్చేశాయని విమర్శించారు. పాఠశాలల ఆవరణలోనే పుస్తకాలు, యూనిఫాంలు, ఇతర విద్యా సామగ్రి విక్రయించడం ద్వారా తల్లిదండ్రులను బలవంతపు కొనుగోళ్లకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం రూపొందించిన నిబంధనలను ఉల్లంఘించడం అత్యంత బాధ్యతారాహిత్యమని పేర్కొన్నారు.ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసినప్పటికీ కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు వాటిని పట్టించుకోకుండా యథేచ్ఛగా పుస్తకాల వ్యాపారం కొనసాగిస్తున్నాయని అన్నారు. మార్కెట్లో అందుబాటులో ఉన్న పుస్తకాలను ఎక్కడి నుంచైనా కొనుగోలు చేసే స్వేచ్ఛ తల్లిదండ్రులకు ఉండాలని, అయితే కొన్ని పాఠశాలలు తమ వద్దనే కొనుగోలు చేయాలని ఒత్తిడి తీసుకురావడం అన్యాయమని తెలిపారు. ఇటువంటి చర్యలు విద్యార్థుల కుటుంబాలపై అదనపు ఆర్థిక భారాన్ని మోపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.జిల్లా విద్యాశాఖ అధికారులు అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అక్రమ పుస్తకాల విక్రయాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. నిబంధనలను ఉల్లంఘించే పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే గుర్తింపు రద్దు చేసే వరకు చర్యలు చేపట్టాలని కోరారు. విద్యను వ్యాపార వస్తువుగా మార్చే ప్రయత్నాలను ఏఐఎస్ఎఫ్ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని స్పష్టం చేశారు.భవిష్యత్తులో జిల్లాలోని ఏ ప్రైవేట్ పాఠశాలలోనైనా పుస్తకాలు, యూనిఫాంలు లేదా ఇతర విద్యా సామగ్రి అక్రమంగా విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు, విద్యాశాఖ కార్యాలయాల ముట్టడులు నిర్వహిస్తామని హెచ్చరించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు లింగం, రాకేష్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలలకు సహకరిస్తున్న ఎంఈఓలపై చర్యలు తీసుకోవాలి

**జిల్లా విద్యాధికారి రోహిణికి ఏఐఎస్ఎఫ్ వినతి**



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 18( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
ప్రైవేట్ పాఠశాలల్లో జరుగుతున్న అక్రమాలను అరికట్టి, యాజమాన్యాలకు సహకరిస్తున్న ఎంఈఓలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం ఏఐఎస్ఎఫ్ నాయకులు సంగారెడ్డి జిల్లా విద్యాధికారి రోహిణికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి దత్తు రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని పలు ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థులు, తల్లిదండ్రులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తూ పాఠశాలల ద్వారానే పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు, ఇతర విద్యా సామగ్రిని కొనుగోలు చేయాలని బలవంతం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ చర్యల వల్ల తల్లిదండ్రులపై అదనపు భారం పడుతోందన్నారు.ఈ విషయమై సంబంధిత మండల విద్యాశాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ వారు స్పందించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో కుమ్మక్కై కొంతమంది అధికారులు వ్యవహరిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, దీనిపై జిల్లా విద్యాశాఖ సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం నిర్దేశించిన విద్యా చట్టాలు, మార్గదర్శకాలను ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై తక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రుల హక్కులను పరిరక్షించేలా చర్యలు చేపట్టాలని కోరారు. విద్యను వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులను దోచుకునే విధానాన్ని ఏఐఎస్ఎఫ్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు.జిల్లా విద్యాధికారి స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా గర్ల్స్ కన్వీనర్ హరిత, పట్టణ కార్యదర్శి రాకేష్, విద్యార్థి నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సర్ ప్రోగ్రాం వివరాలు,బీఎల్ఓల పని తీరును తనిఖీ చేసిన తాసిల్దారు సిద్దేశ్వర రావు.



**రైల్వే కోడూరు జూన్ 18 రిపబ్లిక్ న్యూస్.**
ఓబులవారిపల్లి మండలంలో బి ఎల్ ఓ లు నిర్వహిస్తున్న ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ఎ ని తీ ం ు న ు గురువారంఓబులవారిపల్లి మండల తాసిల్దార్ సిద్దేశ్వర రావు తనకి చేశారు 146,140,144 బూతులు ఉన్న గ్రామాలలో బిఎల్ఓ ల పనితీరును పరిశీలించారు అనంతరం గాదెల , నూకనపల్లి జీవిపురం కొత్తపల్లి, మండలంలోని పలు పంచాయతీల్లో చెన్నరాజుకోడు, బాలిరెడ్డిపల్లి, తదితర గ్రామాల్లో గురువారం బీఎల్ఓ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.
ఈ నేపథ్యంలో తహసీల్దార్ సిద్ధేశ్వరరావు ఆధ్వర్యంలో బి ఎల్ వోలు ఇంటింటికి వెళ్లి ఫారాల పంపిణీ చేశారు. ఓటరు జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, వివరాల మార్పులు మరియు తొలగింపులకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు వివరించారు.2002వ సంవత్సరం ఓటర్ల జాబితా ప్రకారం జిల్లా కలెక్టర్ ఎన్నికల అధికారి డాక్టర్ వెంకటేశ్వర రావు ఆదేశాల మేరకు ఓటర్ల సమగ్ర సవరణ కార్యక్రమం జరుగుతోందన్నారు 2026 జూన్ 15 నుండి 14 జులై 2026 వ సంవత్సరం వరకు బూత్ స్థాయి అధికారులు బిఎల్ఓలు నెల రోజుల్లో ఇంటింటికి తిరిగి సర్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు ఓటర్లు అందుబాటులో ఉండి బిఎల్ఓలు ఇచ్చే ఎన్యూమరేషన్ పత్రాలు తీసుకుని వాటిని భర్తీ చేసి రెండవసారి బిఎల్వోలు మీ ఇంటికి వచ్చినప్పుడు అవి వారికి తిరిగి అందివ్వాలని అన్నారు2002వ సంవత్సరంలో ఓటర్ల జాబితాలో ఉన్న వివరాలను అందులో భర్తీ చేయాలన్నారు, వివరాలు నమోదుకు బిఎల్వోలు పూర్తిస్థాయిలో ఓటర్లకు సహకరిస్తారన్నారు జూలై 14 వ తేదీ లోపల భర్తీ చేసిన పారాలను బిఎల్ఓ లకు అందివ్వాలి అన్నారు, జూలై 21వ తేదీన ప్రకటించబోయే ఓటర్ల ముసాయిదా లో మీ పేరు లేనిచో ఓటరు నమోదు అధికారి ఈ ఆర్ ఓ నోటీసు జారీ చేయడం జరుగుతుంది నోటీసు అందిన తర్వాత 12 రకాల పత్రాలలో ఏదో ఒకటి అర్హతను బట్టి భర్తీ చేసి బిఎల్వోలకు గాని ఈ ఆర్ ఓ అధికారి కి గాని అందజేయాలన్నారు సెప్టెంబరు 22న ప్రకటించబోయే ఓటర్ల జాబితాలో మీ ఓటు నమోదు చేయడం జరుగుతుందన్నారు ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు ఉంటే ఫారం 7 భర్తీ చేసి అందివ్వాలి అన్నారు ఓటర్లు రాజకీయ పార్టీలు రాజకీయ ప్రతినిధులు అందరూ ఈ కార్యక్రమానికి అందుబాటులో ఉండి సహకరించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎన్నికల అధికారి ఆదేశాలను ఓబులవారిపల్లి మండల తాసిల్దార్ సిద్దేశ్వర రావు తెలియజేశారు ఈ కార్యక్రమంలోపంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ అధికారులు, బీఎల్ఓలు, సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు. ప్రజలు ఎన్యూమరేషన్ ఫారాలను సక్రమంగా నింపి సంబంధిత అధికారులకు అందజేసి ఓటరు జాబితా నవీకరణకు సహకరించాలని అధికారులు సూచించారు.

# అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న రైల్వే కోడూరు నియోజకవర్గం.

## మాజీ ఎమ్మెల్యే కొరముట్లపై విరుచుకుపడ్డ ముక్కా







**రైల్వే కోడూరు జూన్ 18, రిపబ్లిక్ న్యూస్**

రెండు సంవత్సరాల ఎన్డీఏ పాలనలో అన్ని రకాల అభివృద్ధి రంగాలలో రాష్ట్రంలోనే రైల్వే కోడూరు నియోజకవర్గం మొదటి స్థానంలో దూసుకుపోతూ ఉందని రైల్వే కోడూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ముక్కా రూపానంద రెడ్డి తెలియచేశారు . గురువారం ఎన్డీఏ పాలన రెండు సంవత్సరాల విజయోత్సవాల సందర్భంగా రైల్వే కోడూరు నియోజకవర్గం లోని రాజు కన్వెన్షన్ హాల్లో కూటమి ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అధ్యక్షతన నిర్వహించిన విజయోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన అనంతరం ముక్కా రూపానంద రెడ్డి మాట్లాడుతూ రైల్వే కోడూరు జనసేన కూటమి ఎమ్మెల్యే గెలిచి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి కూడా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఈ విజయోత్సవ సభను నిర్వహించడం,అందరం పండుగలా జరుపుకోవడం జరిగిందన్నారు. గత రెండు దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీకి ఓటమిని కట్టబెట్టిన నియోజకవర్గ ప్రజలు ఈ దపా కూటమి ఆధ్వర్యంలో రైల్వే కోడూరు నియోజకవర్గానికి జనసేన అభ్యర్థిని గెలిపించినందుకు నియోజకవర్గంలోని ఓటర్లందరికి పాదాభివందనాలని తెలియజేశారు. అదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ లకు కూడా ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీకి కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ ప్రభుత్వంలో అభివృద్ధి పనులు జరిగినంత విధంగా ఎన్నడూ ఏ ప్రభుత్వంలో జరగలేదన్నారు. రైల్వే కోడూరు నియోజకవర్గంలో సుమారు 150 కోట్ల రూపాయలతో పలు రకాల అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. అదేవిధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గత 20 సంవత్సరాలుగా నిలిచిపోయిన గాలేరు నగిరి పనులను పునరుద్ధరించేందుకు 3000 కోట్ల రూపాయలతో మూడు దఫాలుగా దశల వారీగా టెండర్లు నిర్వహించి పనులు చేపట్టేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టడం కూడా జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో రెండేళ్లలో 18 వేల మందికి పైగా లబ్ధిదారులకు సుమారు 20 కోట్ల మేర ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసి, బడుగు బలహీనవర్గాల ప్రజలను ఆదుకోవడం జరిగిందన్నారు. ఇటీవల కాలంలో ఎన్డీఏ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జరుపుకుంటున్న ఉత్సవాలను చూసి వైసిపి ప్రభుత్వం ఓర్వలేకపోయిందన్నారు. వైసిపి ప్రభుత్వాన్ని రాబోయే రోజుల్లో బంగాళాఖాతంలో తొక్కే వరకు కూటమి ప్రభుత్వం నిద్రపోదన్నారు. రైల్వే కోడూరు నియోజకవర్గంలో మాజీ వైసీపీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు కూటమి ప్రభుత్వం పైన, నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి పైన జనసేన ఎమ్మెల్యేపై చేసిన అనుచిత వ్యాఖ్యలు పై రూపానందరెడ్డి తీవ్ర స్థాయిలో ఇరుచుకుపడ్డారు. 15 సంవత్సరాలు ఎమ్మెల్యేగా, ప్రభుత్వ విప్పుగా కొనసాగి,కనీసం నీ సొంత గ్రామానికి కూడా రోడ్డు వేసుకోలేని దుస్థితి నీదని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏమి చేసిందని, ఒక వేలు ఎత్తి చూపేటప్పుడు నాలుగు వ్రేళ్ళు నీ దిక్కు చూస్తున్నాయన్నది తెలుసుకోవాలన్నారు. 15 ఏళ్లు ఎమ్మెల్యేగా కొనసాగిన నీకు ప్రజలు నీ పై విసిగి వేశారిపోయి ఓట్ల రూపంలో సరైన బుద్ధి చెప్పారని,అయినప్పటికీ నీవు సిగ్గు వీడలేదని అన్నారు. టిడిపి ఇన్చార్జి నిద్రపోతున్నాడా అన్న వైసిపి మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యలకు ముక్కా రూపానంద్ రెడ్డి మండిపడ్డారు. నీలా


నిద్రపోతూ నటిస్తూ ఉన్న వారిని నిద్రలేపి అభివృద్ధి అంటే ఏంటో చూపించేవాడే రైల్వే కోడూరు నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి ముక్కా రూపానందరెడ్డి అన్నారు. రాజకీయంగా ఇంతవరకు స్వపక్షంలో గాని ప్రతిపక్షంలో గానీ తాను ఎవరిని విమర్శించిన దాఖలాలు లేవన్నారు. అయితే ఇటీవల నీవు చేసిన అనుచిత వ్యాఖ్యల పైన ఇలాంటి నిజాన్ని నీ కళ్ళకు కట్టినట్లు చూపుతున్నానని ఘాటుగా విమర్శించారు. ఈ విజయోత్సవ సభలో రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర,డిసిఎంఎస్ చైర్మన్ జయప్రకాష్,ఏఎంసీ చైర్మన్ పగడాల వరలక్ష్మి,ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ అనిత దీప్తి, రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రమేష్ బాబు, బిజెపి చంగల్ రాజు, మాజీ మార్కెట్ చైర్మన్, ఓబులవారిపల్లి మాజీ ఎంపీపీ వెంకటేశ్వరరాజు ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు,మహిళ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# రాధాగాయత్రి మృతిపై తల్లి అనుమానం

### అల్లుడే హత్య చేసి ఉంటాడని ఆరోపణ

### లోతైన దర్యాప్తు చేస్తే నిజాలు వస్తాయని వెల్లడి





**విశాఖపట్నం,జూన్ 18 (రిపబ్లిక్ న్యూస్):**

విశాఖకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రాధా గాయత్రి మృతి కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. భర్తతో కలిసి ఉత్తరాఖండ్ వెళ్లిన గాయత్రి అనుమానాస్పదస్థితిలో మరణించింది. గాయత్రి మృతి పట్ల అనుమానం వ్యక్తం చేస్తున్న తల్లి సత్యవతి.. దీనిపై విశాఖ పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. తన అల్లుడు శ్రీచరణ్‌పైనే అనుమానం ఉందన్నారు. ఈ కేసులో పోలీసులు లోతైన దర్యాప్తు చేస్తే అనేక విషయాలు బయటపడతాయని తల్లి సత్యవతి చెప్పారు. 'నా కూతురి మృతి విషయంలో అల్లుడుపైనే అనుమానం. నా కూతురికి మద్యం సేవించే అలవాటు లేదు. గాయత్రిపై అనుమానంతోనే హత్య చేసి ఉండొచ్చు. రిషికేశ్, హరిద్వార్ వెళ్తున్నామని చివరిసారిగా నాకు చెప్పింది. విహారయాత్ర ముగించుకొని విశాఖకు వస్తానని చెప్పింది. విశాఖకు రాకుండానే నా కూతుర్ని హతమార్చారు. విశాఖకు వచ్చిన తర్వాత రెండు నెలలు వర్క్ ఫ్రం హోం పెట్టి ఇక్కడే ఉంటాను అని చెప్పింది. నా కూతురి విషయంలో మీడియా నాకు న్యాయం చేయాలి. మాది సాంప్రదాయమైన కుటుంబం అని తల్లి సత్యవతి ఆవేదన వ్యక్తం చేసింది.

# ఏపీ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదల

**అమరావతిజూన్ 18 (రిపబ్లిక్ న్యూస్):**




ఏపీ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను మంత్రి నారా లోకేశ్ విడుదల చేశారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ ద్వారా లేదా మనమిత్ర వాట్సాప్ నంబర్ 9552300009 ద్వారా తెలుసుకోవచ్చు. విద్యార్థులు తమ హాల్‌టికెట్ నంబర్, అవసరమైన వివరాలు నమోదు చేసి ఫలితాలను చెక్ చేసుకోవచ్చు. ఇంటర్ ప్రథమ సంవత్సరం సప్లిమెంటరీ ఫలితాల్లో 59 శాతం మంది, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 53 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మెరుగైన ఫలితాలు పొందిన విద్యార్థులకు మంత్రి నారా లోకేశ్ అభినందనలు తెలిపారు.


-------

# టిఎంసికి హైకోర్టులో ఎదురుదెబ్బ

### రితబ్రత బెనర్జీ నియామకంపై సవాల్

### మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమన్న హైకోర్టు

**కోల్‌కతా,జూన్ 18 (రిపబ్లిక్ న్యూస్):**




తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా తిరుగుబాటుచేసిన ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై కోల్‌కతా హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చేందుకు నిరాకరించింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ కృష్ణారావు నేతృత్వంలోని ధర్మాసనం.. తదుపరి విచారణ జరిపేంత వరకు స్పీకర్ నిర్ణయం అమలులో ఉంటుందని స్పష్టం చేసింది. ఈ పిటిషన్ తదుపరి విచారణకు ముందే అఫిడవిట్ల మార్పిడిని పూర్తి చేయాలని ఇరు పక్షాలను ఆదేశించింది న్యాయస్థానం. ప్రతివాదులు మూడు వారాల్లోగా తమ వ్యతిరేక అఫిడవిట్‌ను దాఖలు చేయాలని, దానిపై మరో పక్షం వారు రెండు వారాల్లోగా స్పందించాలని గడువు విధించింది. ఈ విషయంపై తదుపరి విచారణ జులై 28కి వాయిదా వేసింది. దీంతో ఈ కేసు ఫలితం వెలువడే వరకు రితబ్రత బెనర్జీ గుర్తింపు పొందిన ప్రతిపక్ష నేతగా కొనసాగనున్నారు. కాగా.. టీఎంసీ నుంచి బహిష్కృతమైన రితబ్రత బెనర్జీ.. ఆ పార్టీకి వ్యతిరేకంగా తిరుగుబాటు ఎమ్మెల్యేలకు న్యాయకత్వం వహిస్తున్నారు. దీంతో బెంగాల్ రాజకీయ సంక్షోభంలో వివాదం రాజుకుంది. తమకు 58 మంది టీఎంసీ ఎమ్మెల్యేల మద్దతుందని పేర్కొంటూ, ఆమె మేనల్లుడైన అభిషేక్ బెనర్జీకి వ్యతిరేకంగా ఓ చీలిక వర్గాన్ని ఏర్పాటు చేశారు రితబ్రత. అయితే.. తిరుగుబాటు వర్గం వాదనను అంగీకరిస్తూ రితబ్రతను ప్రతిపక్ష నాయకుడిగా ఆ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రతీంద్ర బోస్ నియమించడంతో ఈ వివాదం మరింత ముదిరింది. స్పీకర్ నిర్ణయం అధికారికంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీని పక్కనపెట్టిందని, శాసనసభ పార్టీల గుర్తింపును నియంత్రించే రాజ్యాంగ నిబంధనల్ని ఉల్లంఘించిందని వాదిస్తూ.. దీదీ వర్గం కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.

# చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీ కోసం గాలింపు ముమ్మరం

### పవన్ ఆదేశాలతో అటవీశాఖ ప్రత్యేక దృష్టి

**కాకినాడ,జూన్ జూన్ 18 (రిపబ్లిక్ న్యూస్):**





తునిలో చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రోజులు గడుస్తున్నా చిన్నారి జాడ లభించకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారి ఆచూకీ కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు అటవీ శాఖ, ప్రత్యేక హనుమాన్ టీమ్ సంయుక్తంగా థర్మల్ డ్రోన్ల సహాయంతో సెర్చింగ్ ఆపరేషన్‌ను నిర్వహిస్తున్నాయి. రాత్రి వేళల్లోనూ పాప కోసం విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. థర్మల్ డ్రోన్ల ద్వారా అటవీ జంతువుల కదలికలపైనా అధికారులు నిఘా పెట్టారు. చిన్నారిని అడవి జంతువులు ఎత్తుకెళ్లి ఉండవచ్చన్న అనుమానంతో.. ఆ కోణంలోనూ గాలింపు కొనసాగుతోంది. అటవీ ప్రాంతాల్లో జంతువుల కదలికలను గుర్తించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. చిన్నారి జాడను కనిపెట్టడం కోసం పోలీసులు ఇప్పటికే రెండు బొమ్మలను వేలాడదీసి, వాటిలో మాంసం ఎరగా ఉంచారు. ఇప్పటివరకు ఎలాంటి జంతువుల జాడ కానరాకపోవడం గమనార్హం. చిన్నారి ఆచూకీ కోసం అన్ని కోణాల్లోనూ దర్యాప్తు కొనసాగుతోంది. పాప క్షేమంగా తిరిగి రావాలని తల్లిదండ్రులతో పాటు స్థానిక ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

# ప్రతి హార్ట్ పేషెంట్ కు స్టెంట్ వేయాల్సిన అవసరం లేదు!


**స్టెంట్లు, బైపాస్ సర్జరీ సాధ్యం కాని గుండె రోగులకు ఈఈసీపీ ఒక ప్రత్యామ్నాయ చికిత్స**

**శరీరంలో సహజంగానే కొత్త రక్తనాళాలు ఏర్పడటానికి ఈ థెరపీ సహాయం**

**శస్త్రచికిత్స లేకుండా కాళ్లకు కఫ్స్ బిగించి చికిత్స**

**ఇది ఎఫ్‌డీఏ ఆమోదం పొందిన సురక్షితమైన చికిత్సా విధానం**

**ఛాతీ నొప్పి తగ్గి, గుండె పనితీరు మెరుగుపడే అవకాశం**



**జూన్ 18 (రిపబ్లిక్ న్యూస్):**

గుండె జబ్బులతో బాధపడుతూ, స్టెంట్లు వేయడం లేదా బైపాస్ సర్జరీ చేయడం సాధ్యపడని రోగులలో 'ఎన్‌హాన్స్‌డ్ ఎక్స్‌టర్నల్ కౌంటర్‌పల్సేషన్' (ఈఈసీపీ) థెరపీ కొత్త ఆశలు చిగురింపజేస్తోంది. శస్త్రచికిత్స అవసరం లేని ఈ విధానం ద్వారా గుండెకు రక్త ప్రసరణను మెరుగుపరిచి, శరీరంలో సహజంగానే కొత్త రక్తనాళాలు (సహజ బైపాస్‌లు) ఏర్పడేలా ప్రోత్సహించవచ్చని వైద్య నిపుణులు వివరిస్తున్నారు. టైమ్స్ ఆఫ్ ఇండియా కథనం ప్రకారం... తీవ్రమైన గుండెనొప్పితో బాధపడే రోగులకు ఈ చికిత్స ఒక వరమని చెప్పవచ్చు. సరైన మందులు, చికిత్సలు తీసుకున్నప్పటికీ ఛాతీ నొప్పి తగ్గని రోగులు ఎందరో ఉన్నారని బెంగళూరులోని ఆస్టర్ ఆర్వీ ఆసుపత్రి కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ జి. డింపు ఎడ్విన్ జోనాథన్ తెలిపారు. స్టెంట్లు లేదా శస్త్రచికిత్సలు నిర్వహించడానికి వీలులేని క్లిష్ట పరిస్థితుల్లో ఉన్ రోగులకు ఈఈసీపీ ఒక ప్రభావవంతమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు.

**చికిత్స ఎలా పనిచేస్తుంది?**

ఈఈసీపీ ప్రక్రియలో రోగి కాళ్లు, పిరుదుల భాగానికి ప్రత్యేకమైన కఫ్స్‌ను అమర్చి, వాటిని ఈసీజీ యంత్రానికి అనుసంధానిస్తారు. గుండె విశ్రాంతి తీసుకునే సమయంలో ఈ కఫ్స్ గాలితో నిండి, కాళ్ల నుంచి గుండెకు రక్త ప్రసరణను వేగవంతం చేస్తాయి. తిరిగి గుండె కొట్టుకునే సమయంలో ఆ గాలిని విడుదల చేయడం ద్వారా గుండెపై పని భారాన్ని తగ్గిస్తాయి. ఈ చికిత్సను ఏడు వారాల పాటు, వారానికి ఐదు రోజులు, రోజుకు ఒక గంట చొప్పున మొత్తం 35 సెషన్ల పాటు నిర్వహిస్తారు.

ఈ ప్రక్రియ వల్ల మూసుకుపోయిన ధమనుల చుట్టూ కొత్త రక్తనాళాలు అభివృద్ధి చెందుతాయని క్లీవ్‌ల్యాండ్ క్లినిక్ వంటి అంతర్జాతీయ వైద్య సంస్థలు వెల్లడించాయి. ఈ చికిత్స పొందిన సుమారు 30 నుంచి 50 శాతం మంది రోగులలో ఛాతీ నొప్పి తగ్గడంతో పాటు శారీరక శ్రమ చేసే సామర్థ్యం పెరిగినట్లు అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి.

అమెరికాలోని ఎఫ్‌డీఏ ఆమోదం పొందిన ఈ సురక్షితమైన చికిత్సను గర్భిణులు, తీవ్రమైన అధిక రక్తపోటు ఉన్నవారు మాత్రం వైద్యుల పర్యవేక్షణలోనే తీసుకోవాలి. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఇది స్టెంట్లు లేదా బైపాస్ సర్జరీకి పూర్తి ప్రత్యామ్నాయం కానప్పటికీ, ఇతర చికిత్సా మార్గాలు లేని 'నో-ఆప్షన్' రోగులకు ఇది ఒక అద్భుతమైన పరిష్కారం.

# తమిళనాట అనూహ్య రాజకీయ పరిణామాలు

### సిఎం విజయ్‌తో వైకో భేటీతో ఊహాగానాలు -డిఎంకెను వీడుతారన్న ప్రచారం

**చెన్నైజూన్ 18 (రిపబ్లిక్ న్యూస్):**

తమిళనాడు రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి.

తన స్థానాన్ని పదిలం చేసుకునే దిశగా సిఎం విజయ్ అడుగులు వేస్తున్నారు. ద్రవిడ పార్టీలు కలిసినా తన మనుగడకు ఢోకా లేకుండా చేసుకుంటున్నారు. అందుకే అన్నా డిఎంకె ఎమ్మెల్యేలు ఒక్కరొక్కరుగా రాజీనామా చేసి, టివికెలో చేరుతున్నారు. వీరంతా మళ్లీ ఉప ఎన్నికల్లో అధికార పార్టీ నుంచి పోటీచేసే అవకాశం ఉంది. దీంతో అన్నా డిఎంకె కూడా పూర్తిగా బలహీనపడే పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు వైకో సిఎంతో భేటీ కావడం మరో కొత్త అంశం తెరపైకి వచ్చింది. డీఎంకేకు చిరకాల మిత్రపక్షమైన మరుమలార్చి ద్రవిడ మున్నేట్ర కళగం(ఎండీఎంకే) అధికార తమిళగ వెట్రి కళగం(టీవీకే)తో జట్టుకట్టనుందా? అనే చర్చ ఆ రాష్ట్ర రాజకీయాల్లో జోరందుకుంది. ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైకో.. సీఎం జోసెఫ్ విజయ్‌తో భేటీ కావడం ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తోంది. కాగా.. ఇటీవలే వైకో కుమారుడు, ఎండీఎంకే ఎంపీ దురై వైకో కూడా విజయ్‌తో సమావేశమైన సంగతి తెలిసిందే. కాగా.. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే నేతృత్వంలోని కూటమిలో ఎండీఎంకే పోటీచేసి రెండు స్థానాలను కైవసం చేసుకుంది. ఆ పార్టీ సాధారణ మండలి సమావేశం ఈ నెలాఖరులో జరగనుంది. పార్టీ భవిష్యత్తు రాజకీయ దిశగా ఆ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకునే అవకాశమున్నట్టు తెలుస్తోంది. అయితే.. టీవీకే నేతృత్వంలోని మైనారిటీ ప్రభుత్వంపై జరిగిన విశ్వాస పరీక్షలో ఎండీఎంకే తటస్థంగా వ్యవహరించింది. డీఎంకేతో కలిసి పనిచేసిన పలువురు మాజీ మిత్రపక్షాలు ఇప్పటికే టీవీకే ప్రభుత్వానికి మద్దతిస్తున్నాయి. కాంగ్రెస్, వీసీకే, ఐయూఎంఎల్ పార్టీలు అధికార వ్యవస్థలో భాగస్వాములయ్యాయి. మరోవైపు సీపీఐ, సీపీఎం పార్టీలు విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వానికి బయట నుంచే మద్దతు తెలుపుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎండీఎంకే వైఖరి మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. యితే.. ఈ ఊహాగానాలపై వైకో అప్రమత్తంగా వ్యవహస్తున్నట్టు తెలుస్తోంది. పార్టీ భవిష్యత్తు రాజకీయ నిర్ణయాలను సాధారణ మండలి ఆధ్వర్యంలోనే తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. సీఎం విజయ్‌తో సమావేశం పూర్తిగా ప్రజా సమస్యలపైనే జరిగిందని పేర్కొన్నారు. తూత్తుకుడిలో వేదాంత గ్రూప్‌నకు అనుబంధంగా మరో రాగి పరిశ్రమ ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అలాంటి ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వొద్దని కోరానని వెల్లడించారు.




## వెంకీ-కల్యాణ్ రామ్ మల్టీస్టారర్..

### అనిల్ రావిపూడి మార్క్ ఎంటర్‌టైనర్ గ్రాండ్ లాంచ్

టాలీవుడ్‌లో ఎంతో ఆసక్తి రేపుతున్న భారీ మల్టీస్టారర్ చిత్రానికి ఈరోజు అధికారికంగా అంకురార్పణ జరిగింది. విక్టరీ వెంకటేశ్, నందమూరి కల్యాణ్ రామ్ తొలిసారి కలిసి నటిస్తున్న ఈ చిత్రానికి సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా పూజా కార్యక్రమానికి ప్రముఖ దర్శకుడు కె. రాఘవేంద్రరావు, నిర్మాత అల్లు అరవింద్ వంటి సినీ ప్రముఖులు హాజరై సందడి చేశారు.ఈ సినిమాలో కథానాయికల వివరాలను కూడా చిత్ర బృందం అధికారికంగా వెల్లడించింది. వెంకీ సరసన జాతీయ అవార్డు గ్రహీత కీర్తి సురేశ్ నటిస్తుండగా, కల్యాణ్ రామ్ సరసన టాలెంటెడ్ బ్యూటీ కృతి శెట్టి నటించనుంది. దగ్గుబాటి, నందమూరి హీరోల కలయికలో వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్ర నిర్మాణంలో సురేష్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్ సంస్థలు భాగస్వామ్యం వహిస్తున్నాయి. జాతీయ అవార్డు విజేత జి.వి. ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించి, చిత్రాన్ని 2027 సంక్రాంతి కానుకగా విడుదల చేసేందుకు నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు.

## విజయ్ కేవలం స్క్రీన్ హీరో మాత్రమే కాదు: సమంత ప్రశంసలు



తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నటుడు జోసెఫ్ విజయ్‌ను ప్రముఖ నటి సమంత రూత్ ప్రభు బుధవారం చెన్నైలో కలిశారు. విజయ్ కేవలం వెండితెరకే పరిమితమయ్యే కథానాయకుడు కాదని, అంతకుమించిన గొప్ప బాధ్యతలను నిర్వర్తించేందుకే ఆయన జన్మించారని ఈ సందర్భంగా ఆమె అభిప్రాయపడ్డారు. ఈ భేటీ అనంతరం ఆమె ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఒక భావోద్వేగపూరితమైన పోస్టును పంచుకున్నారు."చెన్నైలో అడుగుపెట్టగానే ఈరోజు అనిర్వచనీయమైన ఆనందం కలిగింది. మన ముఖ్యమంత్రిని కలవబోతున్నానన్న ఆలోచన ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది. విజయ్ సార్ కేవలం వెండితెర హీరోగా మాత్రమే ఉండాల్సిన వ్యక్తి కాదని నాకు ఎప్పుడూ అనిపిస్తుండేది. ఆయనకున్న ప్రజాబలం, ప్రజలు ఆయన పట్ల చూపే ఆదరణ చూస్తుంటే, ఆయన ఇంకా ఉన్నత స్థాయికి చేరుకోవాల్సిన వ్యక్తి అని నా నమ్మకం" అని సమంత తన పోస్టులో పేర్కొన్నారు.అత్యున్నత స్థాయిలో ఉన్న సినీ కెరీర్‌ను వదులుకుని, ప్రజాక్షేత్రంలోకి అడుగుపెట్టడం సామాన్యమైన విషయం కాదని, అందుకు ఎంతో ధైర్యం కావాలని ఆమె కొనియాడారు. "అటువంటి సవాలును స్వీకరించే సాహసం కొందరికే ఉంటుంది. తనను నమ్మిన వారి అంచనాలను ఆయన కచ్చితంగా అధిగమిస్తారని నాకు పూర్తి నమ్మకం ఉంది" అని ఆమె తెలిపారు. ఈ నూతన ప్రయాణంలో విజయ్‌కు సంపూర్ణ శక్తి, వివేకం, ధైర్యం చేకూరాలని ఆమె ఆకాంక్షించారు.ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ మొత్తం 234 స్థానాలకు గాను 108 సీట్లను సాధించి అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఈ క్రమంలోనే ఆయన మే 10న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. గతంలో 2016లో విడుదలైన 'తెరి' చిత్రంలో విజయ్, సమంత కలిసి నటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం సమంత, నందిని రెడ్డి దర్శకత్వంలో 'మా ఇంటి బంగారం' అనే చిత్రంలో నటిస్తున్నారు.



## ఫేడౌట్ అనుకుంటే బౌన్స్ బ్యాక్..




టాలీవుడ్ లో హీరోయిన్ల కెరీర్ గ్రాఫ్ ఎప్పుడు ఎలా మారుతుందో అంచనా వేయడం చాలా కష్టం. ఒకట్రెండు ఫ్లాపులు పడినా లేదా కాస్త గ్యాప్ వచ్చినా ఇక ఫేడౌట్ అయిపోయారని ఈజీగా డిసైడ్ చేసేస్తారు. టాలెంటెడ్ బ్యూటీ నివేదా పేతురాజ్ విషయంలో కూడా రీసెంట్ గా ఇలాంటి కామెంట్స్ గట్టిగానే వినిపించాయి. తెలుగులో ఆమెకు అవకాశాలు దాదాపు తగ్గిపోయాయనే టాక్ నడుస్తున్న టైమ్ లో.. సడెన్ గా రెండు భారీ ప్రాజెక్ట్స్ లైన్ లో పెట్టి ఇండస్ట్రీకి పెద్ద షాక్ ఇచ్చింది. గతంలో మెంటల్ మదిలో, చిత్రలహరి, బ్రోచేవారెవరురా, అల వైకుంఠపురములో లాంటి సక్సెస్ ఫుల్ సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న నివేదా పేతురాజ్ కు ఆ తర్వాత ఆశించిన స్థాయిలో సరైన బ్రేక్ రాలేదు. ఆమె కెరీర్ పూర్తిగా స్లో అయిపోయినట్లే అనిపించింది. రీసెంట్ గా వచ్చిన సింగ్ గీతం సినిమాలో కూడా ఆమె కేవలం ఒక చిన్న క్యామియో రోల్ కే పరిమితం అయింది. దీంతో ఆల్మోస్ట్ ఆమె కెరీర్ గ్రాఫ్ పడిపోయిందా అనేలా కామెంట్స్ వచ్చాయి. కానీ ఆమె ప్లానింగ్ వేరేలా ఉంది. విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో రాబోతున్న ఆదర్శ కుటుంబం సినిమాలో నివేదా ఒక క్రేజీ ఛాన్స్ దక్కించుకుని అందరి దృష్టి తనవైపు తిప్పుకుంది. త్రివిక్రమ్ సినిమాల్లో లేడీ క్యారెక్టర్స్ కు ఎంత ఇంపార్టెన్స్ ఉంటుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఈ ప్రాజెక్ట్ లో ఆమె రోల్ చాలా పవర్ ఫుల్ గా, సెకండ్ హాఫ్ లో కథను మలుపు తిప్పేలా ఉండబోతోందని ఇండస్ట్రీ సర్కిల్స్ లో టాక్ వినిపిస్తోంది.



## నేటి నుంచి 'పెద్ది'లో మరో ఆరు నిమిషాల కొత్త సన్నివేశాలు

రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన 'పెద్ది' చిత్రంలో కీలక మార్పులు చేశారు. విడుదలై రెండు వారాలు పూర్తయిన నేపథ్యంలో ప్రేక్షకులకు మరింత మెరుగైన అనుభూతి కల్పించేందుకు చిత్రంలో కొత్త సన్నివేశాలను జోడిస్తున్నట్లు నిర్మాతలు ప్రకటించారు.గురువారం నుంచి థియేటర్లలో ప్రదర్శించే వెర్షన్‌లో అదనంగా 5 నిమిషాల 56 సెకన్ల నిడివి గల కొత్త ఫుటేజీని చేర్చనున్నారు. దీంతో సినిమా నిడివి మరింత పెరగనుంది. ఈ విషయాన్ని చిత్ర బృందం సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. కొత్త సన్నివేశాలతో 'పెద్ది' అనుభూతి మరింత మెరుగవుతుందని పేర్కొంది.

ఇటీవల జాన్వీ కపూర్‌కు సంబంధించిన కొన్ని సన్నివేశాలను చిత్రం నుంచి తొలగించారనే వార్తలు వినిపించాయి. ఈ నేపథ్యంలో కొత్త ఫుటేజీని జోడించడం ఆసక్తికరంగా మారింది. అయితే కొత్తగా చేర్చిన సన్నివేశాల్లో ఏమి ఉంటాయనే విషయాన్ని నిర్మాతలు వెల్లడించలేదు.మరోవైపు, గురువారం నుంచి ఈ చిత్రాన్ని సాధారణ టికెట్ ధరలతో ప్రదర్శించనున్నారు. దీంతో ప్రేక్షకుల ఆదరణ మరింత పెరిగే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.జూన్ 4న విడుదలైన 'పెద్ది'కి తొలి రోజుల్లో మంచి స్పందన లభించింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో పలు ప్రాంతాల్లో ఈ చిత్రం బలమైన వసూళ్లు సాధించింది. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం 14వ రోజున దేశవ్యాప్తంగా రూ.2.45 కోట్ల నికర వసూళ్లు రాబట్టిన ఈ సినిమా మొత్తం ఇండియా నెట్ కలెక్షన్లు రూ.226 కోట్లకు చేరాయి. గ్రాస్ వసూళ్లు రూ.267 కోట్లకు పైగా నమోదైనట్లు సమాచారం.ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద మిశ్రమ స్పందన మధ్య ప్రదర్శితమవుతున్న ఈ చిత్రానికి కొత్త సన్నివేశాలు ఎంతవరకు కలిసివస్తాయన్నది ఆసక్తికరంగా మారింది.

## తిరుమల కొండపై సందడి చేసిన 'మా ఇంటి బంగారం' టీమ్



స్టార్ హీరోయిన్ సమంత నటించిన 'మా ఇంటి బంగారం' సినిమా విడుదలకు సిద్ధమైన వేళ, చిత్ర బృందం తిరుమల శ్రీవారి ఆశీస్సులు తీసుకుంది. గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో చిత్ర యూనిట్ సభ్యులు శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు.నటి సమంత, ఆమె భర్త, చిత్ర నిర్మాత అయిన రాజ్ నిడిమోరు, దర్శకురాలు నందిని రెడ్డి, నటి-యాంకర్ శ్రీముఖి తదితరులు స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న చిత్ర బృందానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వారికి వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

నందిని రెడ్డి దర్శకత్వంలో ఫ్యామిలీ యాక్షన్ కామెడీ డ్రామాగా తెరకెక్కిన 'మా ఇంటి బంగారం' చిత్రం రేపు జూన్ 19న (శుక్రవారం) ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. సినిమా విడుదలకు ఒక్కరోజు ముందు చిత్ర విజయం కోసం స్వామివారిని ప్రార్థించినట్లు చిత్ర బృందం తెలిపింది. ఇప్పటికే ఈ సినిమా ట్రైలర్, ప్రమోషన్లకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించడంతో సినిమాపై అంచనాలు పెరిగాయి.

## 'డ్రాగన్'లో నీల్ నెక్స్ట్ లెవెల్ ప్లాన్.. ఫ్యాన్స్‌కు ఫుల్ ఫీస్ట్!

మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్, కేజీఎఫ్ ఫేమ్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ ప్యాన్-ఇండియా మూవీ 'డ్రాగన్'. ఇటీవలే ఎన్టీఆర్ బర్త్ డే కానుకగా వచ్చిన గ్లిమ్స్ సోషల్ మీడియాను ఎలా షేక్ చేసిందో మనందరికీ తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుండగా తాజాగా ఈ మూవీ నెక్స్ట్ షెడ్యూల్‌కు సంబంధించి ఒక మైండ్ బ్లోయింగ్ అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ క్రేజీ న్యూస్ విన్న నందమూరి ఫ్యాన్స్ ఇప్పుడే థియేటర్లలో పూనకాలు గ్యారెంటీ అని ఫిక్స్ అయిపోతున్నారు. ఆ విశేషాలు చూద్దాం..

శ్రీలంక కొండల్లో హై-ఓల్టేజ్ యాక్షన్:
ప్రస్తుతం డ్రాగన్ షూటింగ్ రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగుతోంది. ఇక టీమ్ ముఖ్యమైన సీన్లు షూట్ చేస్తున్నారు. డ్రాగన్ తదుపరి భారీ షెడ్యూల్ కోసం చిత్ర యూనిట్ మొత్తం శ్రీలంకకు పయనం కానుంది. ప్రశాంత్ నీల్ మార్క్ యాక్షన్ సీన్స్ ఏ రేంజ్‌లో ఉంటాయో మనకు తెలుసు. ఇక శ్రీలంకలోని అద్భుతమైన, కనువిందు చేసే లొకేషన్లలో ఎన్టీఆర్‌పై కొన్ని మైండ్ బ్లాంక్ అయ్యే హై-ఓల్టేజ్ యాక్షన్ సీన్లను ప్లాన్ చేశారు నీల్. వచ్చే నెలలో ప్రారంభం కాబోయే ఈ భారీ షెడ్యూల్‌తో సినిమాకు సంబంధించిన ఒక మేజర్ పార్ట్ షూటింగ్ కంప్లీట్ అవ్వబోతోందని సమాచారం.: ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో కన్నడ క్రష్, బ్యూటిఫుల్ నటి రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తోంది. అలాగే బాలీవుడ్ ఎగర్‌గ్రీన్ స్టార్ అనిల్ కపూర్, మలయాళ వర్సటైల్ యాక్టర్ బిజూ మీనన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇక ఈ భారీ క్యాస్టింగ్ సినిమాపై అంచనాలను మరింత పెంచేస్తోంది. ఈ చిత్రానికి కేజీఎఫ్ ఫేమ్ రవి బస్రూర్ సంగీతం అందిస్తుండగా ఎన్టీఆర్ ఆర్ట్స్ మరియు మైత్రీ మూవీ మేకర్స్ సంయుక్తంగా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.



# ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలి

**ప్రతి అర్హుడైన ఓటరు జాబితాలో నమోదు కావాలి**

**బీఎల్‌ఓలు ఎన్యుమరేషన్ ఫారాలను స్వయంగా బీఎల్‌ఓ యాప్‌లో నమోదు చేయాలి**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**





**నంద్యాల బ్యూరో, జూన్ 18 (రిపబ్లిక్ న్యూస్):** ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా గురువారం సిరివెళ్ల మండలంలోని గోవిందపల్లి గ్రామాన్ని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని స్వర్ణగ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. సచివాలయ పరిధిలో పనిచేస్తున్న బూత్ లెవెల్ అధికారులు (బీఎల్‌ఓలు) నిర్వహిస్తున్న పనితీరు, వారి సంఖ్య, రోజువారీగా స్వీకరిస్తున్న దరఖాస్తులు, వాటి పరిష్కార స్థితి, ఇప్పటివరకు నమోదైన చేర్పులు, తొలగింపులు, మార్పుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా, పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ లెవెల్ ఏజెంట్లు (బీఎల్‌ఏలు)తో సమావేశమై ప్రత్యేక సవరణ కార్యక్రమంపై వారి అభిప్రాయాలు, సూచనలు తెలుసుకున్నారు. ప్రతి అర్హుడైన ఓటరు ఓటర్ల జాబితాలో నమోదయ్యేలా చర్యలు చేపట్టాలని, ఎలాంటి ఫిర్యాదులకు తావు లేకుండా కార్యక్రమాన్ని సమగ్రంగా అమలు చేయాలని సూచించారు. జిల్లాలో ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని మరింత సమర్ధవంతంగా నిర్వహించేందుకు బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో ధృవీకరించాలని కలెక్టర్ ఆదేశించారు. ధృవీకరణ అనంతరం ఎన్యుమరేషన్ ఫారాలను స్వయంగా బీఎల్‌ఓ యాప్‌లో నమోదు చేసి పూర్తి చేయాలని సూచించారు. వివరాల నమోదు సమయంలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా అత్యంత జాగ్రత్తతో వ్యవహరించాలని, ప్రతి అర్హ ఓటరుకు సంబంధించిన సమాచారం ఖచ్చితంగా నమోదు కావాలని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా నాణ్యతను మెరుగుపరచడం, పారదర్శకతను పెంపొందించడం లక్ష్యంగా ప్రతి ఎన్యుమరేషన్ ఫారాన్ని క్షుణ్ణంగా పరిశీలించి యాప్‌లో నవీకరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రత్యేక సవరణ కార్యక్రమం విజయవంతం కావడానికి రాజకీయ పార్టీలు, బీఎల్‌ఏలు, బీఎల్‌ఓలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

# గాజులపల్లిలో వినూత్న ఉద్యాన పంటల సాగుపై కలెక్టర్ పరిశీలన

**అధిక ఆదాయాన్ని అందించే హార్టికల్చర్ పంటల వైపు రైతులు మళ్లాలి**

**నీటి సంరక్షణకు ఫామ్ పాండ్లు, ఆధునిక సాగు విధానాలను విస్తృతంగా అమలు చేయాలి**







**నంద్యాల బ్యూరో, జూన్ 18 (రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలో ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని పెంపొందించడంతో పాటు రైతుల ఆదాయాన్ని అధికం చేసే వినూత్న సాగు విధానాలను ప్రోత్సహించేందుకు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా గురువారం మహానంది మండలం గాజులపల్లి గ్రామంలో పలు ఉద్యాన పంటల తోటలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్యానవన శాఖ అధికారులతో కలిసి రైతులు అనుసరిస్తున్న ఆధునిక సాగు పద్ధతులు, నీటి సంరక్షణ చర్యలు, అంతర పంటల సాగు విధానాలపై వివరాలు తెలుసుకున్నారు. గ్రామానికి చెందిన రైతు హుస్సేన్ రెడ్డి సాగు చేస్తున్న గులాబీ తోటను కలెక్టర్ పరిశీలించారు. సుమారు నాలుగు ఎకరాల్లో సాగవుతున్న ఈ తోటలో పీఎండీఎస్ మరియు మల్చింగ్ పద్ధతులను అమలు చేయడం ద్వారా నేలలో సేంద్రీయ కార్బన్ శాతం పెరిగి నాణ్యమైన దిగుబడులు సాధిస్తున్నట్లు రైతు వివరించారు. ఈ తోటలో 'అర్కా సవి' అనే కొత్త రకం గులాబీ వెరైటీని సాగు చేయడం విశేషమని ఉద్యానశాఖ అధికారులు తెలిపారు. అలాగే డ్రిప్ ఇరిగేషన్ విధానంలో బంతి పంట సాగును కూడా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో లబ్ధి పొందిన కమ్యూనిటీ ఫామ్ పాండ్‌ను పరిశీలించారు. సుమారు ఒక కోటి లీటర్ల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం కలిగిన ఈ ఫామ్ పాండ్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.7 లక్షల వరకు సబ్సిడీ అందించినట్లు ఉద్యానశాఖ అధికారులు వివరించారు. నీటి కొరత పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఫామ్ పాండ్లు ఎంతో ఉపయోగకరమని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే అరటి తోటలో అమలు చేస్తున్న మల్టిపుల్ క్రాపింగ్ విధానాన్ని పరిశీలించారు. అరటి, ఆయిల్ పామ్ మరియు పీఎండీఎస్ విధానాల సమ్మేళనంతో అంతర పంటలను సాగు చేస్తూ రైతులు మెరుగైన ఆదాయం పొందుతున్న తీరును తెలుసుకున్నారు. గ్రామానికి చెందిన రైతులు లక్ష్మయ్య, మురళి సాగు చేస్తున్న తోటలను కూడా కలెక్టర్ సందర్శించారు. అక్కడ మామిడి, అవకాడో, అరటి పంటలను సమ్మిళితంగా సాగు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. అవకాడోలో తొలిసారిగా సాగు చేస్తున్న 'బల్బ్' రకాన్ని పరిశీలించి దాని సాగు అవకాశాలపై కలెక్టర్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా తోటలో పెంచుతున్న మల్బరీ చెట్లను, తినదగిన మల్బరీ పండ్లను కూడా పరిశీలించి రైతుల ప్రయోగాత్మక సాగు విధానాలను అభినందించారు. అదేవిధంగా గాజులపల్లి గ్రామానికి చెందిన రైతు హుస్సేన్ తన పొలంలో చేపడుతున్న యాపిల్ సాగును పరిశీలించిన కలెక్టర్, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా కొత్త పంటలను ప్రయోగాత్మకంగా సాగు చేస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నందుకు ఆయనను కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాంప్రదాయ పంటలతో పోలిస్తే అధిక ఆదాయం అందించే ఉద్యాన పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలో కొత్త రకాల పంటల సాగును ప్రోత్సహిస్తూ రైతులకు అవసరమైన సాంకేతిక సహాయం అందించాలని ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను సద్వినియోగం చేసుకుని రైతులు ఫామ్ పాండ్లు ఏర్పాటు చేసుకోవాలని, వాటి ద్వారా అత్యవసర పరిస్థితుల్లో లైఫ్ సేవింగ్ ఇరిగేషన్ అందించి పంటలను సంరక్షించుకోవచ్చని తెలిపారు. జిల్లాలో ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని మరింత పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

# యోగతో ఒత్తిడికి చెక్.. ఆరోగ్యానికి భరోసా

**: కలెక్టర్ డా. ఏ.సిరి**

**పారిశుద్ధ్య కార్మికుల యోగా కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే గౌరు చరిత**

**కర్నూలు నగర పరిశుభ్రతకు ప్రజల సహకారం అవసరమని పిలుపు**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 18)** మానసిక ఒత్తిడిని తగ్గించుకుని ఆరోగ్యవంతమైన జీవితం గడపాలంటే ప్రతి ఒక్కరూ నిత్యం యోగా చేయాలని జిల్లా కలెక్టర్, కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ ఏ. సిరి సూచించారు. కర్నూలు ఎస్‌ఏపీ క్యాంపు ఆవరణలో నిర్వహించిన పారిశుద్ధ్య కార్మికుల థీమాటిక్ యోగా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు.



యోగ ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులను నియంత్రణలో ఉంచడంలో యోగ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రస్తుతం పెరుగుతున్న జీవన ఒత్తిడుల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ యోగను జీవనశైలిలో భాగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.పారిశుద్ధ్య కార్మికులు నగర పరిశుభ్రత కోసం చేస్తున్న సేవలు అమూల్యమని కొనియాడిన కలెక్టర్, విధుల నిర్వహణలో రక్షణ పరికరాలు తప్పనిసరిగా ఉపయోగించాలని సూచించారు. ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరిస్తూ చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ, ఆరోగ్యమే మహాభాగ్యమని, శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు యోగ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం ఒక గంట యోగా చేయాలని సూచించారు. అలాగే ఇంటితో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, సెట్కూర్ సీఈఓ డాక్టర్ వేణుగోపాల్, ఆయుష్ అధికారులు, యోగా శిక్షకులు, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



# ఆత్మకూరు పట్టణంలో ఈనెల 19న 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

**'వన్ మంత్ - ఫోర్ విజిట్' కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక గ్రీవెన్స్ స్వీకరణ**



**నంద్యాల బ్యూరో, జూన్ 18 (రిపబ్లిక్ న్యూస్):** జిల్లా పరిపాలన చేపట్టిన "వన్ మంత్ – ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా ఈ నెల 19వ తేదీన ఆత్మకూరు పట్టణంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆత్మకూరు పట్టణంలోని ఎం.ఎం. ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డితో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఆత్మకూరు మండల ప్రజలకు సంబంధించిన సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు హాజరై ప్రజల సమస్యలను పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని కలెక్టర్ తెలిపారు. ఆత్మకూరు మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలు, వినతులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# నేరాల నియంత్రణకు డ్రోన్ కెమెరాతో ప్రత్యేక నిఘా





**బండి ఆత్మకూరు ,జూన్ 18, (రిపబ్లిక్ న్యూస్):-** అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన డ్రోన్ కెమెరాలతో పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచి నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా గురువారం మండలంలోని ఈర్ణపాడు, ఓంకారం , నారాయణపురం గ్రామ పరిసర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాతో పోలీసులు సోదాలు నిర్వహించారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగేందుకు ఆస్కారం లేకుండా డ్రోన్ కెమెరాతో పర్యవేక్షిస్తున్నట్లు ఎస్సై జగన్మోహన్ తెలిపారు. ఒక్కో రోజు ఒక్కో ప్రాంతంలో డ్రోన్ కెమెరాను తిప్పుతూ సాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా అనుమానిత ప్రదేశాలు ,గ్రామ శివారు ప్రాంతాలు, పంట పొలాలు,అటవీ సమీప ప్రదేశాల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగడానికి ఆస్కారం లేకుండా డ్రోన్ కెమెరాతో ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ లియాఖత్,చెన్నయ్య, ఇతర పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

# పోలీసు స్టేషన్ అకస్మిక తనిఖీ



**బండి ఆత్మకూరు, జూన్ 18, ( రిపబ్లిక్ న్యూస్) :** స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులతో హుందాగా ప్రవర్తించాలని ఏఎస్పి మంద జావళి పోలీసు అధికారులకు సూచించారు. బండి ఆత్మకూరు పోలీస్ స్టేషన్ ను గురువారం ఏఎస్పి మంద జావళి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆమె స్టేషన్ లోని రికార్డులు పరిశీలించారు.ఈ సందర్భంగా ఏఎస్పీ మంద జావళి మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం పోలీసు స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలు అడిగి తెలుసుకోని వాటిని పరిష్కరించాలని పోలీసు సిబ్బందికి సూచించారు.స్టేషన్ లో పెండింగ్లో ఉన్న కేసుల గురించి ఎస్సై జగన్మోహన్ తో వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యాత్మక గ్రామాల్లో నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు సాగించే వ్యక్తులపై దృష్టి సారించాలని తెలిపారు. పోలీసు శాఖ సేవలు ప్రజలకు అందించాలని సూచించారు.అనంతరం పోలీసు సిబ్బంది పనితీరు,సేవలపై నేరుగా సిబ్బందితోనే అడిగి తెలుసుకున్నారు.పోలీసు స్టేషన్ లో పనిచేస్తున్న మొత్తం సిబ్బంది వివరాలను ఎస్సై జగన్మోహన్ తో అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

# క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి

**హోంగార్డులకు ప్రమాదబీమా సౌకర్యంపై యాక్సిస్ బ్యాంక్ ప్రతినిధులతో అవగాహన**

**ప్రజలకు మెరుగైన సేవలు అందించి మన్ననలు పొందండి**



**నంద్యాల క్రైం, జూన్ 18, (రిపబ్లిక్ న్యూస్):** పట్టణంలోని బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీసు కార్యాలయంలోని మైదానంలో గురువారం హోంగార్డ్స్ పెరేడ్, దర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 60 మంది హోంగార్డులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్ కుమార్ హోంగార్డ్ కవాతును పరిశీలించడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ హోంగార్డ్ సంక్షేమానికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, ప్రతి సంవత్సరం హోంగార్డులకు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య పరీక్షలు చేయించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని దాని వలన కలిగే ఉపయోగాలను గురించి తెలియజేశారు. మరియు హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలు, వాటి ప్రయోజనాలు, ఆరోగ్య భద్రత కోసం బీమా ప్రాముఖ్యతపై యాక్సిస్ బ్యాంక్ ప్రతినిధులతో హోంగార్డులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతోపాటు నంద్యాల జిల్లాకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకొని వచ్చే విధంగా అందరూ కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనపరచిన హోంగార్డులకు ప్రశంసా పత్రాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా సాయుధ బలగాల అడిషనల్ ఎస్పి చిన్ని కృష్ణ, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, హోంగార్డ్ డి.ఎస్.పి ప్రసాద్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు బాబు, విజయ్ లు, ఆర్ఎస్ లు హర్షవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com